Facebook.varadhinews

విశ్వ
# వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com

సంపుటి:1
సంచిక:33
ఆదివారం,
06.10.2024

WANTED

జిల్లాల వారీగా ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ / మండల రిపోర్టర్లు కావలెను.

తెలంగాణ అస్తిత్వానికి మార్గదర్శిగా, ప్రజా గొంతుకగా మీ ముందుకు వస్తున్న "వారధి తెలుగు దినపత్రిక" లో పనిచేయుటకు ఉమ్మడి జిల్లా బ్యూరోలు/ జిల్లా స్టాఫ్ రిపోర్టర్/మండల రిపోర్టర్లు ను ఆహ్వానిస్తోంది. అనుభవం, తెలుగు భాషపై పట్టు ఉన్న వారు.. ఆసక్తి గల వారు సంప్రదించవచ్చు.

సంప్రదించాల్సిన నెంబర్లు:
9492580091

## గద్దర్ ఉద్యమ స్ఫూర్తి, ప్రజా చైతన్యం నేటి సమాజానికి ఆదర్శం



- అమరులు నూటికో కోటికో ఒకరు పుడతారు
- అలాంటి వారిలో గద్దర్ ఒకరు
- ఆయనకు నల్లమలతో అవినాభావ సంబంధం
- అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ
- మన్ననూరులో ప్రజా యుద్ధ నౌక గద్దర్ విగ్రహావిష్కరణ

2 లో



# పెద్దలు ఫామ్‌హౌజ్‌ల్లో.. పేదలు మురికిలోనా..?

- మూసీ మీద బీఆర్ఎస్‌వి మొసలి కన్నీళ్లు
- పేదల బతుకులు మార్చేందుకు ప్రక్షాళన
- మూసీ పేరిట మాపై దుష్ప్రచారం చేస్తున్నారు
- పేదలపై అంత ప్రేముంటే మీ భూములివ్వండి
- గజ్వేల్‌ఫాంహౌస్‌లో 500 ఎకరాలిస్తే పేదలకు ఇళ్లు కడతాం
- పార్టీ ఫండ్‌నుంచి రూ.500 కోట్లిస్తే వారి బతుకులు మారుస్తాం
- పదేళ్లలో దోచింది బయటకు తీయండి
- మూసీ రివర్ ఫ్రంట్ ఆలోచన మీద కాదా..?
- నాటి సర్కారులో మంత్రిగా ఈటల లేరా..?
- సబర్మతీలా మూసీని ప్రక్షాళన చేయొద్దా
- కాకా జయంతి సభలో సీఎం రేవంత్ వ్యాఖ్యలు
- మూసీ నిర్వాసితుల కోసం ప్రత్యేక కమిటీ

**వారధి, స్టేట్ బ్యూరో:**
హైదరాబాద్‌లో రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోన్న మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపై సీఎం రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మూసీ ప్రక్షాళనలో భాగంగా ఇండ్లు కోల్పోతున్న బాధితుల బాధ తనకు తెలుసని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు. ఇన్నేళ్లు ప్రతిపక్షంలో ఉండి.. అలాంటి ఎందరి బాధలనో చూసే ఇంత దూరం వచ్చామని గుర్తు చేశారు. కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకట స్వామి (కాకా) 95వ జయంతి కార్యక్రమాన్ని హైదరాబాద్ రవీంద్ర భారతిలో నిర్వహించగా.. సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా.. హైడ్రా కూల్చివేతలు, మూసీ ప్రాజెక్టు విషయంలో ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలపై సీఎం రేవంత్ రెడ్డి స్పందించారు. మూసీ బాధితులను అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ నాయకులు రాజకీయం చేస్తున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కలుషిత వాతావరణంలో బతుకులు వెళ్లదీస్తున్న మూసీ నిర్వాసితులకు మంచి జీవితాలు అందించేందుకు.. ప్రణాళికలు రచించి ఇవ్వాలని వాటిని ప్రభుత్వం అమలు చేస్తుందంటూ చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం దోచుకున్న దాంట్లో 10 శాతం ఇచ్చిన వారి బతుకులు బాగుపడతాయన్నారు. ఇప్పటికీ బీఆర్ఎస్ పార్టీ అకౌంట్‌లో 1500 కోట్లు ఉన్నాయని.. మూసీ నిర్వాసితులపై ప్రేమ ఉంటే అందులో నుంచి 500 కోట్లు ఇవ్వాలన్నారు. గజ్వేల్‌లో 1000 ఎకరాల్లో ఉన్న ఫాంహౌస్‌లో కొంత స్థలం, జన్వాడలో ఉన్న 50 ఫాంహౌస్‌లో కొంత స్థలం ఇస్తే.. వారికి ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని తెలిపారు.

**పేదలకు పరిహారంపై సూచనలివ్వండి..**
ఈ క్రమంలోనే.. మూసీ బాధితుల కోసం ఏం చేయాలన్న అంశంపై ఓ కమిటీ వేద్దామని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఆ కమిటీలో బీఆర్ఎస్

2 లో

### మూసీ నిర్వాసితుల కోసం కమిటీ..


అసెంబ్లీ (2023 ) ఎన్నికల్లో విజయం తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సంచలన నిర్ణయాలు తీసుకుంటుంది. ఈ క్రమంలోనే మహా నగరంలోని అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మోపేందుకు హైడ్రాను తీసుకొచ్చింది. అలాగే మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ కోసం కూడా అనేక చర్యలు తీసుకుంటుంది. ఇందులో భాగంగా ఇప్పటికే మూసీ పరివాహక ప్రాంతాల్లో సర్వే నిర్వహించి.. తొలగించాల్సిన ఇండ్లకు మార్క్ కూడా చేశారు. అయితే ఇక్కడే ప్రభుత్వానికి ప్రజలు, ప్రతిపక్షాల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లను కూలిస్తే.. రోడ్డున పడతారని నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం మూసీ నిర్వాసితుల జీవనోపాధి కోసం కీలక నిర్ణయం తీసుకుంది. మూసీ నిర్వాసితుల జీవనోపాధి కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ చైర్మన్‌గా సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్‌ను నియమించగా.. ఈ ప్రత్యేక కమిటీలో 14 మందికి చోటు కల్పించినట్లు శనివారం సాయంత్రం తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## తెలంగాణ రైతులను కాంగ్రెస్ మోసం చేసింది

- ఇన్ని నెలలు గడుస్తున్నా రుణమాఫీ పూర్తి చేయలేదు
- ఎన్నికలకు ముందు అబద్ధపు హామీ ఇచ్చారు
- కాంగ్రెస్ వాళ్లవి బ్రిటీష్ పాలకుల ఆలోచనలే
- డ్రగ్స్ దందా వెనుక కాంగ్రెస్ నేతలు
- ప్రధాని నరేంద్ర మోడీ సంచలన వ్యాఖ్యలు



2 లో



## బెట్టింగ్‌లకు కుటుంబం బలి

- విషవలయంలా ఆన్‌లైన్ గేమ్స్
- కుమారుడి అప్పులు తీర్చలేక కుటుంబం బలవన్మరణం
- నిమాజాబాద్‌లో జిల్లాలో దారుణం

2 లో

## ఎవ్వరినీ వదిలిపెట్టను.. అందరి లెక్కలు తేలుస్తా

- నా మీద ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నరు
- సీఎం రేవంత్‌పై పరువు నష్టం దావా వేస్తా
- మూసీ కంపంతా సీఎం, మంత్రుల నోట్లోనే
- రైతు రుణమాఫీ, రైతు భరోసా సంగతేంది..?
- ఇప్పుడిస్తాం.. అప్పుడిస్తాం అని మాయ చేస్తున్నరు
- ఇంతవరకూ ఆరు గ్యారెంటీల ఊసే లేదు
- కాంగ్రెస్ సర్కారుపై కేటీఆర్ ఆగ్రహం



**వారధి, స్టేట్ బ్యూరో:**
రంగారెడ్డి జిల్లా కందుకూరులో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ రైతు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని.. కీలక వ్యాఖ్యలు చేశారు. అధికారం వచ్చిన వెంటనే.. మొదటి సంతకం రైతు రుణమాఫీ ఫైలు మీద పెడతానంటూ ఊదరగొట్టి.. తీరా అధికారంలోకి వచ్చాక ఇప్పుడిస్తాం అప్పుడిస్తామంటూ సీఎం రేవంత్ రెడ్డి ఆలస్యం చేశారని కేటీఆర్ మండిపడ్డారు. ఆలస్యమైన పూర్తిగా చేశారా అంటే అదీ లేదని..10 నెలలు గడిచినా

2 లో

## కేటీఆర్, హరీశ్ రావు అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్లు

- రుణమాఫీపై బీఆర్ఎస్‌ది అసత్య ప్రచారం
- ఆయన రాజీనామా సవాలు ఎటు పోయింది?
- మూసీ మురుగు నుంచి పేదలకు విముక్తి
- ఇందూరుకు త్వరలోనే అమాత్యయోగం
- బోధన్ చక్కెర ఫ్యాక్టరీ తెరిపించే పూచీ మాదే
- పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్



**వారధి, స్టేట్ బ్యూరో:**
పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నిజామాబాద్ పర్యటన కొనసాగుతోంది. శనివారం డిచ్‌పల్లి సీఎస్ఐ ఆసుపత్రిలో డాక్టర్స్ క్వార్టర్స్ ప్రారంభించారు. అనంతరం ఆయన ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. సీఎస్ఐ ఆధ్వర్యంలో త్వరలోనే నర్సింగ్ కళాశాల ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డితో మాట్లాడి డిచ్‌పల్లిలో మెడికల్ కాలేజీని పున:ప్రారంభిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు.

**మూసీ ప్రక్షాళన తథ్యం..**
ఒకప్పుడు జీవనదిగా ఉన్న మూసీ కాలుష్య కాసారంగా మారిందని, అందుకే దాని ప్రక్షాళనకు తాము పూనుకున్నామని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. వేలాది పేదలు

2 లో



## టాలీవుడ్‌పై మంత్రి పొన్నం ఫైర్

- మంత్రి సురేఖ తన వ్యాఖ్యలు ఉపసంహరించుకున్నారు
- సారీ చెప్పినా మళ్లీ మాట్లాడటమెందుకు
- బీసీ వర్గాల మహిళా మంత్రి ఒంటరి కాదు
- ఇచ్చిన హామీలు ఖచ్చితంగా అమలుచేస్తాం
- బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటేనని వ్యాఖ్య

2 లో

## రాష్ట్రాల తీరు ఆందోళనకరం

- మాకు ఓపిక నశించింది
- చివరి అవకాశం ఇస్తున్నాం
- లేదంటే అధికారులు కోర్టుకు రావాల్సిందే
- రేషన్ కార్డుల జాప్యంపై సుప్రీంకోర్టు అసహనం



**వారధి న్యూస్, న్యూఢిల్లీ:**
రేషన్ కార్డుల జాప్యంపై సర్వోన్నత న్యాయస్థానం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. వలస కార్మికులు ఈశ్రమ్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకున్నా.. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు మాత్రం రేషన్ కార్డులు జారీ చేయడం లేదు. దీంతో ప్రభుత్వాల తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. రాష్ట్రాల తీరు ఆందోళనకరమని, ఈ విషయంలో తమకు ఓపిక నశించిందని ధ్వజమెత్తింది. కరోనా సమయంలో వలస కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని.. సర్వోన్నత న్యాయస్థానం 2020లో దీనిపై సుమోటోగా విచారణ చేపట్టింది. ఈ క్రమంలోనే జాతీయ ఆహార భద్రత చట్టం కింద కోటాతో సంబంధం లేకుండా ఈశ్రమ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్న దాదాపు 8 కోట్ల వలస కార్మికులకు రేషన్ కార్డులు జారీ చేయాలని 2021లో అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను

3 లో

## ప్రతీకారంతో రగిలిపోతున్న ఇజ్రాయెల్

- ఏ క్షణమైనా ఇరాన్‌పై దాడికి సన్నాహాలు
- రోజుల వ్యవధిలో భారీ దాడి చేస్తాం
- ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ప్రకటన

3 లో

## హస్తం వైపే ప్రజల మొగ్గు!

- హర్యానాలో కాంగ్రెస్‌కే మెజారిటీ సీట్లు
- బీజేపీ హ్యాట్రిక్‌కు బ్రేకులు
- జమ్మూకశ్మీర్‌లో హంగ్
- కింగ్ మేకర్‌గా మారనున్న పీడీపీ
- రెండు రాష్ట్రాల ఎగ్జిట్ పోల్స్ విడుదల

3 లో



## డిసెంబర్ 9న పేదలకు భూ పంపిణీ
## ప్రభుత్వ భూములు పంచుతాం

- ఏ ఒక్క రైతు భూ సమస్యతో ఇబ్బంది పడొద్దు
- ధరణి పోర్టల్‌లో మార్పులు చేస్తున్నాం
- మంత్రి పొంగులేటి కీలక ప్రకటన



**వారధి న్యూస్, నాగార్జున సాగర్:**
ధరణి పోర్టల్‌తో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆటలు ఆడిందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. శనివారం మంత్రి పొంగులేటి నల్లగొండలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధరణిలోని లోపాలను పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. యాచారం, తిరుమలగిరి మండలాలను పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. భవిష్యత్‌లో భూమి విషయంలో

3 లో

విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com


# పెద్దలు ఫామ్‌హౌజ్‌ల్లో.. పేదలు మురికిలోనా..?

**తరువాయి భాగం**

వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీష్ రావు, బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్‌తో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సభ్యులుగా పెడదామని పేర్కొన్నారు. వీళ్లంతా కలిసి చర్చించి.. ఆ పేదలకు ఎలాంటి న్యాయం చేయాలన్న అంశంపై సూచనలు ఇవ్వాలంటూ సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. పేద వారికి మేలు చేసేందుకు ఓ కమిటీ వేద్దామన్నారు. బీఆర్ఎస్, బీజేపీ, ప్రభుత్వం కూర్చొని పేదలకు ఏం చేద్దామో ఆలోచన చేద్దామని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మూసీ ఒడ్డున ఉన్న పేదలకు మంచి చేయాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందుకోసం అవసరమైతే.. మలక్ పేటలో ఉన్న రేసు కోర్టును నగర శివారులోకి తరలిద్దామన్నారు. అక్కడ ఇందిరమ్మ ఇండ్లు కట్టించి పేదలకు పంచుదామన్నారు. దాంతో పాటు.. అంబర్ పేటలో ఉన్న పోలీస్ అకాడమీని కూడా తరలించి.. సుమారు 100 ఎకరాల్లో పేదల కోసం ఇందిరమ్మ ఇండ్లు కట్టించి.. వారికి మంచి జీవితాలు ఇద్దామని రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు.

**అవసరమైతే రూ.10వేల కోట్లు ఖర్చు పెడతాం..**

మూసీ నిర్వాసిత కుటుంబాలకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసే బాధ్యత ప్రభుత్వానిదని సీఎం నొక్కిచెప్పారు. రెచ్చగొట్టే ప్రతిపక్ష నేతల మాటలు నమ్మొద్దని, ప్రభుత్వానికి స్పష్టమైన విధానం ఉన్నదని వివరించారు. పదేండ్లలో దోచుకున్న సొమ్ముతో ఫామ్ హౌజ్‌లు కట్టుకున్న బీఆర్ఎస్ లీడర్లు ఇప్పుడు వాటిని కాపాడుకునేందుకు పేదల పక్షం ఉంటున్నామనే ముసుగును అడ్డు పెట్టుకుంటున్నారని, పేదలను రక్షణ కవచంలా వాడుకుంటున్నారని, వారి మాటల మాటలో పడొద్దని సీఎం విజ్ఞప్తి చేశారు. ఫామ్‌హౌజ్‌లలో జమీందార్లుగా బతికే వారు ఇప్పుడు మూసీ మురికి కంపులో నివసిస్తున్న పేదలను ఎప్పటికీ అలాగే ఉంచి లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. మూసీ పరివాహక ప్రాంతంలోని పేద కుటుంబాలు ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం వారిని ఆదుకోడానికి పది వేల కోట్ల రూపాయలను ఖర్చు చేయడానికైనా సిద్ధంగా ఉన్నదని స్పష్టత ఇచ్చారు. పేదల మంచి కోసమే ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమం అయిపోగానే.. సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. మూసీ నిర్వాసితులకు న్యాయం చేసే బాధ్యతలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రి పొన్నం ప్రభాకర్‌కు అప్పగించారు. బాధితులకు ఎలాంటి న్యాయం చేయాలన్న దానిపై అందరితో చర్చించి ఓ నిర్ణయం తీసుకోవాలని సూచించినట్లు తెలుస్తోంది.



# ఎవ్వరినీ వదిలిపెట్టను.. అందరి లెక్కలు తేలుస్తా

**తరువాయి భాగం**

ఇప్పటికీ పూర్తిగా చేయలేదని ఆరోపించారు. అవే కాకుండా.. రైతు బోనస్ పేరుతో రూ.500 ఇస్తామని చెప్పారని... రైతు భరోసా పేరిట ఏటా రూ.15 వేలు ఇస్తామని మాట ఇచ్చారని కేటీఆర్ గుర్తు చేశారు. ఇప్పుడు ఆ రైతు బంధు లేదూ.. రైతు భరోసా లేకుండా చేశారని మండిపడ్డారు.

**ఆరు గ్యారెంటీలు ఎక్కడ..?**

రుణమాఫీ చేసేందుకు డబ్బులు లేవని చెప్తున్న సీఎం రేవంత్ రెడ్డి.. లక్షన్నర కోట్లతో మూసీని ప్రక్షాళన చేసేందుకు సిద్ధమయ్యారని మండిపడ్డారు. ఎన్నికల వేళ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేస్తే అందులో కమీషన్లు రావని.. మూసీ ప్రాజెక్టు అయితే కోట్లకు కోట్లు దోచుకోవచ్చని.. ఇది మొదలుపెడుతున్నారని ఆరోపించారు. ఉన్న సిటీని పట్టించుకోకుండా ఇప్పుడు కొత్తగా.. ఫ్యూచర్ సిటీ కడతానని సీఎం రేవంత్ రెడ్డి చెప్తున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

**పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడితే ఊరుకోం..**

మరోవైపు.. మూసీలోని కంపు అంతా సీఎం రేవంత్ రెడ్డి నోట్లోనే ఉందని కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తన మీద అడ్డగోలుగా మాట్లాడిన మంత్రి కొండా సురేఖను వదిలిపెట్టనని కేటీఆర్ చెప్పుకొచ్చారు. క్రిమినల్ కేసుతో పాటు పరువు నష్టం దావా కూడా వేస్తానని తెలిపారు. ఇక.. సీఎం రేవంత్ రెడ్డి మీద కూడా పరువు నష్టం దావా వేస్తానని కేటీఆర్ చెప్పుకొచ్చారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నారని ఏది మాట్లాడినా వదిలేశామని.. ఇప్పుడు మాత్రం వదిలేది లేదన్నారు. తప్పు చేయని వారి గురించి పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడతామంటే అస్సలు ఊరుకునేది లేదన్నారు. ప్రధాని నరేంద్ర మోదీనే ఏం చేసుకుంటావో చేసుకో అన్నామని.. ఈ చిట్టి నాయుడు ఎంత అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

**పేదల ఇళ్ల జోలికెళ్లొద్దు..**

మరోవైపు.. సబితా ఇంద్రారెడ్డి ఫాంహౌస్‌లు ఎక్కడ ఉన్నాయో చెప్తే.. తామే కూలగొడుతామని కేటీఆర్ అడిగారు. బీఆర్ఎస్ నేతల ఇళ్లు కూలగొడితేనే రేవంత్ రెడ్డి కడుపు మంట చల్లారుతుందంటే చెప్పాలని.. వాటిని తామే కూల్చుకుంటామని.. కానీ పేదల ఇళ్లను వదిలిపెట్టాలని విజ్ఞప్తి చేశారు. మూసీ బాధితుల గోస చూస్తుంటే బాధ అనిపిస్తోందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.



# బెట్టింగ్‌లకు కుటుంబం బలి

- విషవలయంలా ఆన్‌లైన్ గేమ్స్
- కుమారుడి అప్పులు తీర్చలేక కుటుంబం బలవన్మరణం
- నిమాజాబాద్‌లో జిల్లాలో దారుణం

**వారధి న్యూస్, నిజామాబాద్:** లోన్, బెట్టింగ్ యాప్‌లతో అప్పులు చేసి తీర్చే మార్గం లేక ఎంతోమంది బలైపోతున్నారు. తాజాగా నిజామాబాద్ జిల్లాలో మరో కుటుంబం బలైంది. కుమారుడు బెట్టింగ్ కోసం చేసిన అప్పులు తీర్చలేక కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకుంది. సంతోషంగా ఉన్న కుటుంబాల పాలిట బెట్టింగ్ యాప్‌లు యమపాశాలుగా మారుతున్నాయి. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన రంగణవేని సురేశ్, హేమలతలు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. కుమారుడు హరీశ్ (22) పదో తరగతి వరకు చదివి మానేశాడు. అద్దె ఇంట్లో ఉంటూ కిరాణం దుకాణం నడుపుతున్నారు. వ్యవసాయం, కిరాణం మీద వచ్చే ఆదాయంతో కుటుంబంతో సంతోషంగా ఉండేది. అయితే కరోనా సమయంలో హరీశ్, ఆన్‌లైన్ బెట్టింగ్, పబ్జీ గేమ్‌లకు అలవాటు పడ్డాడు. ఇలా ఆడుతూనే దాదాపు రూ.30 లక్షలు అప్పు చేశాడు. కుమారుడు చేసిన అప్పులు తీర్చడానికి తమకున్న ఎకరం వ్యవసాయ భూమిని అమ్మేసి రూ.12 లక్షలు తల్లిదండ్రులు చెల్లించారు. అయినా అప్పులు పూర్తిగా తీరలేదు. ఇంకా సుమారు రూ.18 లక్షల అప్పు ఉండటంతో ఏం చేయాలో పాలుపోలేదు.కుటుంబానికి ఆధారంగా ఉన్న భూమి పోయింది. కిరాణా దుకాణంతో వచ్చేది అంతంతమాత్రంగానే ఉంది. పిల్లర్ల దశకు వచ్చిన ఇంటి నిర్మాణం సైతం ఆగిపోయింది. దీనికి తోడు మిగిలిన అప్పు ఎలా తీర్చాలో తెలియక, తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. దీంతో కుమారుడు హరీశ్‌తో కలిసి తండ్రి సురేశ్, తల్లి హేమలతలు ఇంట్లోనే చీరతో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు చనిపోవడంతో గ్రామంలో విషాదం నెలకొంది. బెట్టింగ్ యాప్‌ల జోలికి వెళ్లొద్దని ఎంత మొత్తుకుంటున్నా, పెడచెవిన పెడుతున్న యువత అనేక కుటుంబాలను రోడ్డున పడేస్తున్నారు



# గద్దర్ ఉద్యమ స్ఫూర్తి, ప్రజా చైతన్యం

- నేటి సమాజానికి ఆదర్శం
- అమరులు నూటికో కోటికో ఒకరు పుడతారు
- అలాంటి వారిలో గద్దర్ ఒకరు
- ఆయనకు నల్లమలతో అవినాభావ సంబంధం
- అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ
- మన్ననూరులో ప్రజా యుద్ధ నౌక గద్దర్ విగ్రహావిష్కరణ



**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ బ్యూరో:** ప్రజా యుద్ధ నౌక గద్దర్ ఉద్యమ స్ఫూర్తి , ప్రజా చైతన్యం నేటి సమాజానికి ఆదర్శమని, చేతిలో భారత రాజ్యాంగం పట్టుకొని రాజ్యాంగ పరిరక్షణకు గద్దర్ కృషి చేశాడని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీ కృష్ణ అన్నారు. శనివారం సాయంత్రం అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామం శ్రీశైలం రహదారిలో ప్రజా యుద్ధ నౌక గద్దర్ విగ్రహావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గద్దర్‌కు ఈ నల్లమలతో ఎంతో అవినాభావ సంబంధం వుందని, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఎన్నికల ముందు చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో పాల్గొని ప్రజలను చైతన్యం చేశాడని అన్నారు. పుట్టిన ప్రతి మనిషి ఏదో ఒక రోజు మరణిస్తారని.. కానీ మరణించి కూడా ఎవరైతే ప్రజల మనస్సులో భావి తరాల మనుగడలో బ్రతికే ఉంటారో వారే అమరులన్నారు. అలాంటి అమరులు నూటికో కోటికో ఒకరు పుడతారని.. అలా మరణించి కూడా బతికున్న మనుషుల్లో గద్దర్ ఒకరని కొనియాడారు. దొరల పాలనలో దయనీందిన జీవితాలతో అణగారిన బతుకుల్లో అరుణ కిరణమై వెలిగాడన్నారు. బడుగువర్గాల కుడి భుజము తానై బానిసలా వందేళ్లు బతికేకంటే వీరుడిలా ఒక్క క్షణం బ్రతికిన చాలని.. జీవచ్ఛవాలుగా ఉన్న మనుషుల్లో తన మాటతో పాటతో చైతన్యాన్ని నింపి.. పోరుబాటలో విప్లవ కాగడా తానయ్యాడని అన్నారు. అలుపెరుగని యోధుడిలా ముందుండి దండు నడిపి.. బడుగువర్గాల బానిస సంకెళ్లను తెంచి ఆఖరి శ్వాస వరకు సమాజం కోసం బతికిన తెలంగాణ ముద్దుబిడ్డ ప్రజా యుద్ధ నౌక గద్దర్ అని అన్నారు. కార్యక్రమంలో ప్రసిద్ధ అంతర్జాతీయ రచయిత షెఫర్డ్ ప్రొఫెసర్ కంచె ఐలయ్య, అంబేద్కర్ ఐడియాలజిస్ట్ జె.బి. రాజు, బలబోయిన సుదర్శన్ (అసిస్టెంట్ ప్రొఫెసర్, ఓయు), గదర్ కుమార్తె వెన్నెల గద్దర్, కొల్లూరు సత్తయ్య గద్దర్ విగ్రహ దాతతో పాటు నల్లమల్ల కళాకారులు, గద్దర్ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.





# తెలంగాణ రైతులను కాంగ్రెస్ మోసం చేసింది

- ఇన్ని నెలలు గడుస్తున్నా రుణమాఫీ పూర్తి చేయలేదు
- ఎన్నికలకు ముందు అబద్ధపు హామీ ఇచ్చారు
- కాంగ్రెస్ వాళ్లవి బ్రిటీష్ పాలకుల ఆలోచనలే
- డ్రగ్స్ దందా వెనుక కాంగ్రెస్ నేతలు
- ప్రధాని నరేంద్ర మోడీ సంచలన వ్యాఖ్యలు




**వారధి న్యూస్, ముంబయి:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తెలంగాణ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. ఎన్నికలకు ముందు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, తీరా అధికారంలోకి వచ్చి ఇన్ని నెలలు గడుస్తున్నా ఇచ్చిన హామీని పూర్తి చేయలేదని ఆరోపించారు. రుణమాఫీ ఎందుకు చేయడం లేదని ఇప్పటికీ తెలంగాణలో రైతులు అక్కడి సర్కారును నిలదీస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికలకు ముందు రుణమాఫీ చేస్తామని అబద్ధపు హామీలు ఇవ్వడం కాంగ్రెస్ పార్టీకి అలవాటు అని కామెంట్ చేశారు. మహారాష్ట్ర ప్రజలు ఈ విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని, రైతులకు పక్షపాతి ఎన్డీయే ప్రభుత్వమేనని చెప్పారు. మహారాష్ట్రలో మహావికాస్ అఘాడీ అధికారంలో ఉన్నప్పుడు రైతు ప్రయోజనాలకు సంబంధించిన ఎన్నో పనులను నిలిపేసిందని, కేంద్రం నుంచి రైతుల కోసం ఎన్నో నిధులు విడుదల చేస్తే వాటిని దారిమళ్లించి జేబులో వేసుకున్నారని ఆరోపణలు గుప్పించారు. ఆ తర్వాత షిండే సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక అన్నదాతలకు ప్రయోజనాలు చేకూర్చే పనులు పరుగులు పెట్టాయని వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు డెడ్‌లైన్ లోపే రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీని ప్రకటించింది. మూడు విడతలుగా రుణమాఫీ చేసింది. ఇందుకోసం సుమారు రూ. 18 వేల కోట్లను విడుదల చేసింది. ప్రభుత్వం చెబుతున్నట్టుగా రైతులందరికీ రుణమాఫీ కాలేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. పలుచోట్ల రైతులు కూడా రోడ్డెక్కి తమకు రుణమాఫీ కాలేదని ఆవేదన చెందారు. రాష్ట్రంలోని అర్హులైన రైతులందరికీ రుణమాఫీ జరిగిందని సీఎం రేవంత్ రెడ్డి చెబుతుండగా.. కొందరికి జరగలేదని వాదనను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అంగీకరించారు. ఇలా మాఫీ జరగని అర్హులైన రైతులకు కూడా రుణమాఫీ చేస్తామని స్పష్టం చేశారు.

**రైతులు రోడ్డెక్కే పరిస్థితి వచ్చింది..**

ఇప్పుడు మహారాష్ట్రలో పీఎం కిసాన్ సమ్మాన్ నిధితో పాటు షిండే ప్రభుత్వం కూడా అదనంగా రైతులకు ఆర్థిక సహాయం అందిస్తున్నదని ప్రధాని మోడీ వివరించారు. పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం ఉన్నప్పుడు కూడా ఇలాగే అదనపు సహాయాన్ని రైతులకు అందించిందని, కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఆర్థిక సహాయాన్ని నిలిపేసిందని తెలిపారు. ఇదే వరుసలో తెలంగాణలో రైతు రుణమాఫీని ప్రధాని మోడీ ప్రస్తావించారు. తెలంగాణలో రైతు రుణమాఫీ జరగలేదని, రైతులు రోడ్డెక్కే పరిస్థితులు నెలకొన్నాయని, రాష్ట్ర ప్రభుత్వంపై వారు ప్రశ్నలు గుప్పిస్తున్నారని వివరించారు.

**దేశాన్ని ముక్కలు చేయడమే వారి లక్ష్యం..**

దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక కాంగ్రెస్ పార్టీని ఒక కుటుంబం చెప్పు చేతల్లోకి తీసుకుందని, బ్రిటీష్ పాలకుల నుంచి అధికారాన్ని అందిపుచ్చుకున్న ఆ కుటుంబం ఆలోచనలు కూడా విదేశీ పాలకుల లాగే ఉంటాయని ప్రధాని మోడీ ఆరోపణలు చేశారు. పేదలు పేదలుగానే, బలహీనులు బలహీనులుగానే ఉంచాలని కాంగ్రెస్ కోరుకుంటుందని, దేశ పురోగతిని అడ్డుకునేవారే ఆ పార్టీకి మద్దతుగా ఉన్నారన్నారు. భారతీయులను విభజించి దేశాన్ని ముక్కలు చేయాలని చూస్తున్నదని, ఈ విషయాన్ని ప్రజలు జాగ్రత్తగా గమనించాలని పేర్కొన్నారు.

**డ్రగ్స్ వెనుక కాంగ్రెస్‌నేతలు**

ఢిల్లీలో వేల కోట్ల విలువైన డ్రగ్స్ వ్యవహారం బట్టబయలైందని, ఆ డ్రగ్స్ రాకెట్ వెనుక ఓ కాంగ్రెస్ నాయకుడు ఉన్నాడని ప్రధాని పేర్కొన్నారు. డ్రగ్స్‌తో యువతను మత్తులోకి నెట్టి.. మాదక ద్రవ్యాల అమ్మకాలతో వచ్చిన డబ్బులతో కాంగ్రెస్ ఎన్నికల పోరాడాలని అనుకుంటున్నదని ఆరోపించారు. తమ ప్రభుత్వం మాత్రం దేశ ప్రజల పురోగతి కోసమే పని చేస్తుందని, వికసిత్ భారత్ వైపుగా నిర్ణయాలు తీసుకుంటుందని వివరించారు. ఇందులో ముఖ్యంగా రైతులను అభివృద్ధి పథంలో నడిపించడమే ప్రధానంగా ఉంటుందన్నారు. తాము సాగు కోసం ఎన్నో నిర్ణయాలు తీసుకున్నామని, మౌలిక వసతులు సహా ఎన్నో ప్రాజెక్టులను విజయవంతంగా చేపట్టామని పేర్కొన్నారు. మహాయుతిని గెలిపిస్తే మహారాష్ట్ర రైతులకు రెట్టింపు లాభం కలుగుతుందని వివరించారు.

# టాలీవుడ్‌పై మంత్రి పొన్నం ఫైర్

- మంత్రి సురేఖ తన వ్యాఖ్యలు ఉపసంహరించుకున్నారు
- సారీ చెప్పినా మళ్లీ మాట్లాడటమెందుకు
- బీసీ వర్గాల మహిళా మంత్రి ఒంటరి కాదు
- ఇచ్చిన హామీలు ఖచ్చితంగా అమలుచేస్తాం
- బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒక్కటేనని వ్యాఖ్య

వారధి, స్టేట్ బ్యూరో: సహచర మంత్రి కొండా సురేఖ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్న తరువాత కూడా సినీ పరిశ్రమకు చెందిన పలువురు స్పందించడంపై బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఒకింత అసహనం వ్యక్తం చేశారు. బలహీన వర్గాల మహిళా మంత్రి కొండా సురేఖ ఒంటరి కాదు అని హెచ్చరించారు. ఇవాళ గాంధీభవన్‌లో చిట్ చాట్ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను ఆమె స్వచ్ఛందంగా ఉపసంహరించుకున్నారన్నారు. ఆ తరువాత కూడా పలువురు స్పందించడం సరియైనది కాదన్నారు.మొన్న బీజేపీ, ఇవాళ బీఆర్ఎస్ పార్టీలు రైతుల కోసం ఆందోళన చేశారంటే తాము ముందు నుంచి అనుకున్నట్లుగానే ఒకరి తరువాత ఒకరు రైతుల కోసం ఆందోళన చేశాయంటే, ఆ రెండు పార్టీలు ఒకటేనని ఆరోపించారు. రాష్ట్రంలో వరద నష్టం రూ.10 వేల కోట్లు జరిగితే కేంద్రం కేవలం రూ.400 కోట్లు ఇచ్చిందని మంత్రి పొన్నం అసంతృప్తి వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధికారం నుంచి దిగిపోయే సమయానికి రూ.40 వేల కోట్ల విలువైన బిల్లులు పెండింగ్ పెట్టిందని ఆరోపించారు. బతుకమ్మ చీరలకు కూడా బకాయి పెట్టి పోయినట్లు విమర్శించారు.

**త్వరలో హామీలన్నీ నెరవేరుస్తాం..**

ఈ పది నెలల్లో సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో తమ ప్రజా ప్రభుత్వం పాలన విజయవంతంగా కొనసాగిందని వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ నిర్మాణాత్మక అభివృద్ధిని చేసుకుంటూ పోతున్నట్లు వివరించారు. రెసిడెన్షియల్ విద్యాసంస్థల సమస్యలపై సీఎంతో చర్చించినట్లు మంత్రి పొన్నం తెలిపారు. సమస్యల పరిష్కారానికి సీఎం, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారని అన్నారు. గురుకుల స్కూళ్లలో చాలా వాటికి సొంత భవనాలు లేవన్న మంత్రి, మెస్, డైనింగ్ హాళ్లకు గ్రీన్‌ఛానెల్ ద్వారా నిధులివ్వాలని కోరినట్లు తెలిపారు. గురుకుల స్కూళ్లలో పాములు, దోమలు లేకుండా చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చారు.

# కేటీఆర్, హరీశ్ రావు అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్లు

**తరువాయి భాగం**

మూసీ మురుగులో జీవిస్తున్నారని, వారిని అక్కడి నుంచి తరలించి ఇండ్లు అందిస్తామని క్లారిటీ ఇచ్చారు. విపక్షాలు దీనిని రాజకీయ సమస్యగా గాక సామాజిక సమస్యగా చూడాలని కోరారు. హైడ్రా మహాయజ్ఞమని అది ఆగదని స్పష్టం చేశారు. హైడ్రాను ఆపితే హైదారాబాద్ మరో వయనాడ్ అవుతుందని, త్వరలోనే హైడ్రాను జిల్లాలకు విస్తరిస్తామని, ప్రభుత్వ స్థలాలు అక్రమిస్తే ఎంతటి వారైనా వదిలిపెట్టబోమని, తన కుటుంబసభ్యులు కబ్జా చేసినా ఉపేక్షించాల్సిన పనిలేదని ప్రకటించారు. మూసీ పేరుతో ప్రభుత్వం నిధులు మళ్లిస్తోందన్న కేటీఆర్ ప్రశ్నకు జవాబిస్తూ.. మూసీ సుందరీకరణ ప్రాజెక్టు డి.పి.అర్ ఇంకా సిద్ధం కాలేదని, అలాంటప్పుడు నిధులు ఎలా మళ్లిస్తామో వారే చెప్పాలన్నారు.ఆయన ప్రశ్నలు చూస్తుంటే కేటిఆర్ అమెరికాలో నిజంగా చదివాడా లేక డబ్బులిచ్చి సర్టిఫికెట్ కొన్నాడోనని అనుమానం వస్తోందన్నారు.

**హరీష్.. అబద్ధాలొద్దు**

రైతు డిక్లరేషన్ సభలో రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు తమ ప్రభుత్వం వచ్చిన 3 విడతలలో రైతు రుణమాఫీ చేపట్టిందని పీసీసీ అధ్యక్షుడు వివరించారు. కొన్ని సాంకేతిక కారణాల వల్ల రుణమాఫీలో ఇబ్బందులున్న కారణం చూపి, బీఆర్ఎస్ నేత హరీష్ రావు అసలు రుణమాఫీయే జరగనట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో ఎంత రుణమాఫీ జరిగిందో హరీష్ చెప్పాలని డిమాండ్ చేశారు. ధర్నాల పేరిట హరీష్ రావు ప్రజలను మభ్య పెట్టటానికి బదులు రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానని చేసిన సవాలు సంగతి ఏమైందో చెప్పాలని ఎద్దేవా చేశారు.



**ఇందూరుకు గుర్తింపు..**

నిజామాబాద్ జిల్లాకు పూర్వ వైభవం కాంగ్రెస్‌తోనే సాధ్యమన్నారు.త్వరలోనే బోధన్ షుగర్ ఫ్యాక్టరీని కూడా పునరుద్ధరిస్తామని అన్నారు. త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ, పార్టీ పదవులపై ప్రకటన చేస్తామని, రాబోయే మంత్రి వర్గ విస్తరణలో నిజామాబాద్‌కు చోటు దక్కనుందని ఆయన హామీ ఇచ్చారు.

www.varadhinews.com
3
ఆదివారం, 06.10.2024
విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
జనరల్ న్యూస్

# రాష్ట్రాల తీరు ఆందోళనకరం

**తురువాయిభాగం**
ఆదేశించింది. ఇప్పటివరకు కొన్ని రాష్ట్రాలు మాత్రమే ఈ ప్రక్రియను పూర్తి చేయగా.. మిగతా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు జాప్యం చేస్తున్నాయి. దీంతో న్యాయస్థానం మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ అంశంలో ఎలాంటి ఉదాసీనతకు చోటు లేదని స్పష్టం చేసింది. ఈ విషయంలో ఓపిక నశించిందని.. మా ఉత్తర్వులను పాటించేందుకు మీకు చివరి అవకాశం ఇస్తున్నట్లు తెలిపింది. లేదంటే మీ కార్యదర్శులు కోర్టుకు రావాల్సి ఉంటుందని ధర్మాసనం హెచ్చరించింది. ఈ వ్యవహారంపై నవంబరు 19లోగా కేంద్రం, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తగిన చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

## డిసెంబర్ 9న పేదలకు భూ పంపిణీ
# ప్రభుత్వ భూములు పంచుతాం




**తురువాయిభాగం** రైతన్నకు ఎలాంటి భయం లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. ధరణి ప్రక్షాళన విషయంలో ప్రతిపక్షాల సలహాలు, సూచనలు స్వీకరిస్తామని అన్నారు. గతంలో భూమి లేకున్నా పాస్ పుస్తకాలు సృష్టించి రైతుబంధు తీసుకున్నారని గుర్తుచేశారు. నిజమైన రైతులకు లబ్ధి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు.
డిసెంబర్ నాటికి అర్హులైన పేదలకు ప్రభుత్వ భూములు పంచుతామని కీలక ప్రకటన చేశారు. నాగార్జున సాగర్ నియోజకవర్గానికి 5 వేల ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని అన్నారు. కాగా, తెలంగాణలో త్వరలోనే కొత్త ఆర్వోఆర్ చట్టం అమల్లోకి రానుంది. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉండే విధంగా చట్టాన్ని రూపొందించినట్టు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఈ కొత్త చట్టం రూపకల్పన విషయంలో ప్రజల అభిప్రాయాలు పరిగణలోకి తీసుకుంటామని పొంగులేటి పేర్కొన్నారు. ధరణి పోర్టల్ వల్ల తెలంగాణ ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారని.. ఇప్పటికే చాలా భూసమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని మంత్రి వివరించారు. కొత్త చట్టం తీసుకొచ్చి.. అందరి భూ సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# ప్రతీకారంతో రగిలిపోతున్న ఇజ్రాయెల్

- ఏ క్షణమైనా ఇరాన్‌పై దాడికి సన్నాహాలు
- రోజుల వ్యవధిలో భారీ దాడి చేస్తాం
- ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ప్రకటన

వారధి న్యూస్, న్యూఢిల్లీ:ఏ క్షణమైనా ఇరాన్ పై దాడి చేసే యోచనలో ఇజ్రాయెల్ ఉంది. ప్రతీకార దాడులకు ఇజ్రాయెల్ ప్రధాని వ్యూహాలు రచిస్తున్నారు. రోజుల వ్యవధిలోనే తమ ప్రతీకారం ఉంటుందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో ఏ క్షణమైనా దాడులు జరగొచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది. అటు, ఇరాన్ లోని ఆయిల్ సెంటర్లపై ఇజ్రాయెల్ గురి పెట్టింది. చమురు కేంద్రాలపై దాడి చేసి ఇరాన్ ఆర్థిక వ్యవస్థపై దెబ్బకొట్టాలన్నది ఇజ్రాయెల్ ఆలోచన.

**తగ్గేదేలే అంటున్న ఇరాన్..**

మరోవైపు ఇరాన్ కూడా తగ్గేదేలే అంటోంది. దెబ్బకు దెబ్బ తీస్తామంటోంది. ఇజ్రాయెల్ కు తమ దెబ్బ రుచి ఏంటో చూపిస్తామంటోంది. ఇజ్రాయెల్ లోని గ్యాస్ నిల్వలను టార్గెట్ చేస్తామని ఇరాన్ వార్నింగ్ ఇస్తోంది. ఇదిలా ఉండగా.. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ శాంతి మార్గాన్ని సూచిస్తుంటే.. ట్రంప్ మాత్రం ఇజ్రాయెల్ ప్రతీకార దాడి చేస్తుందని భావిస్తున్నారు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. యూఎస్ ఎన్నికలపై తీవ్ర ప్రభావం పడేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కావాలనే గాజా కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ప్రధాని బెంజమన్ నెతన్యాహూ బ్రేక్ చేస్తున్నారని అన్నారు. కానీ, ఇజ్రాయెల్ ప్రధాని చర్యలను లెక్క చేయాల్సిన అవసరం లేదన్నారు బైడెన్.
ఇజ్రాయెల్ కు తనకంటే ఎక్కువ సాయం ఎవరూ చేయలేదన్న బైడెన్.. దాన్ని నెతన్యాహు గుర్తుంచుకోవాలన్నారు. ఇరాన్ చమురు కేంద్రాలపై కాకుండా ఇజ్రాయెల్ ప్రత్యామ్నాయం ఆలోచించాలని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ సూచించారు. యుద్ధం విషయంలో ఇజ్రాయెల్ ఓ నిర్ణయానికి రాలేకపోతోందన్నారు. తాను వారి స్థానంలో ఉంటే చమురు కేంద్రాలపై దాడికి బదులు ప్రత్యామ్నాయల గురించి ఆలోచిస్తానని బైడెన్ తెలిపారు.



# హస్తం వైపే ప్రజల మొగ్గు!

**వారధి న్యూస్, న్యూఢిల్లీ:**
దేశంలో బీజేపీకు ఎదురుగాలి వీస్తోందా అంటే ఇవాళ జరిగిన హర్యానా, జమ్ము కశ్మీర్ పోలింగ్ ఎగ్జిట్ పోల్స్ అదే చెబుతున్నాయి. ప్రముఖ సర్వే సంస్థ పోల్ స్టర్స్ ఎగ్జిట్ పోల్స్ విడుదల చేసింది. హర్యానాలో ఈసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలో రానుందని పోల్ స్టర్స్ సహా అన్ని సంస్థలు తేల్చి చెప్పాయి.. కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన మెజార్టీతో అధికారంలో వస్తోందని వెల్లడించాయి.

**హర్యానాలో కాంగ్రెస్‌కే మెజారిటీ సీట్లు**

హరియాణా అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసిన వెంటనే వివిధ సర్వే సంస్థలు ఎగ్జిట్ పోల్స్ అంచనాలను వెలువరించాయి. 90 అసెంబ్లీ నియోజకవర్గాలున్న ఈ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే కనీసం 46 స్థానాల్లో విజయం సాధించాల్సి ఉంటుంది. మెజార్టీ సర్వే సంస్థలు కాంగ్రెస్ పార్టీయే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని అభిప్రాయపడ్డాయి. దీనితో హరియాణాలో వరుసగా మూడో దఫా అధికారం చేపట్టాలన్న బీజేపీకి నిరాశే ఎదురైనట్టు కనిపిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల వేళ హరియాణాలో రాజకీయ సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి. దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న హరియణా పీఠాన్ని సొంతం చేసుకునేందుకు బీజేపీ, కాంగ్రెస్ తమ శక్తికి మించి కృషి చేశాయి. వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని బీజేపీ , ఎలాగైనా అధికారం చేజిక్కించుకోవాలని కాంగ్రెస్ తీవ్ర ప్రయత్నాలు చేశాయి. శనివారం పోలింగ్ దశ ముగియడం వల్ల వివిధ సర్వే సంస్థలు ఎగ్జిట్ పోల్స్ అంచనాలను ప్రకటించాయి.

**కశ్మీర్‌లో హంగ్ అసెంబ్లీకి ఛాన్స్**

పదేళ్ల తర్వాత జరిగిన జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకి మెజారిటీ సీట్లు రాబోవని సర్వే సంస్థలు అంచనా కట్టాయి. నేషనల్ కాన్ఫరెన్స్ కాంగ్రెస్ కూటమికి ఎక్కువ సీట్లు వస్తాయని చెప్పినప్పటికీ, ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన సీట్లకు అటూ ఇటుగా సీట్లు వస్తాయని అంచనా వేశాయి. బీజేపీకు కనిష్ఠంగా 20 గరిష్ఠంగా 32 స్థానాలు వస్తాయని పేర్కొన్నాయి. మెహబూబా ముఫ్తీకి చెందిన పీడీపీ సింగిల్ డిజిట్‌కు పరిమితం కానుందని సర్వే సంస్థలు అంచనా వేశాయి.
జమ్ముకశ్మీర్‌కు స్వయంప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దు, రాష్ట్ర హోదా తొలగించిన తర్వాత నిర్వహించిన ఎన్నికలు కావడంతో దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. మొత్తం 90 స్థానాలకు గానూ మూడు విడతల్లో ఎన్నికలు జరిగాయి. ఫలితాలు అక్టోబర్ 8న వెలువడనున్నాయి. ప్రభుత్వ ఏర్పాటుకు 46 స్థానాలు అవసరం. 2014లో జరిగిన ఎన్నికల్లో ఏ పార్టీకీ సరైన మెజారిటీ రాకపోవడంతో భాజపా, పీడీపీ ఉమ్మడిగా ప్రభుత్వం ఏర్పాటు చేశాయి. ఈ సారి ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు వేర్వేరుగా పోటీ చేశాయి. ఇండియా కూటమిలోని కాంగ్రెస్, ఎన్సీ పొత్తుతో బరిలోకి దిగాయి.

# ఎస్సీ విద్యార్థులు ఉపకార వేతనాలకు దరఖాస్తులు చేసుకోవాలి

- జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి పివి శ్రవణ్ కుమార్



**వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:** నాగర్ కర్నూల్ జిల్లాలోని షెడ్యూల్ కులానికి చెందిన విద్యార్థులు 2024 -25 విద్యాసంవత్సరానికి ప్రభుత్వం చెల్లించే ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి పి.వీ శ్రవణ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ప్రక్రియ మూడు దశల్లో ఉంటుందని, డెమో అథెంటికేషన్, బయోమెట్రిక్ అథెంటికేషన్, రిజిస్ట్రేషన్ దశలు ఉంటాయన్నారు. మొదటి దశలో ఈ పాస్ వెబ్సైట్లో నూతన/రిన్యూవల్ రిజిస్ట్రేషన్లో భాగంగా ఆధార్కార్డు నంబర్ సమర్పించి, ఎస్ఎస్సీ వివరాలతో సరి చేసుకోవాలన్నారు. రెండో దశలో బయోమెట్రిక్ అథెంటికేషన్ చేయాలని, ఒక వేళ వివరాలు సరిపోకపోతే విద్యార్థి ఉన్న రికార్డు ఆధారంగా మీసేవా కేంద్రాల్లో అప్డేట్ చేయాలన్నారు. మూడో దశలో గతంలో మాదిరిగా వేతనాల వివరాలను పూర్తిగా నింపి, దరఖాస్తులు సమర్పించాలన్నారు.పూర్తి వివరాలకు జిల్లా కలెక్టరేట్లోని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

**ఈ-పాస్ వెబ్‌సైట్లో దరఖాస్తు ఇలా చేసుకోండి**

రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ విద్యార్థుల కోసం ఈపాస్ వెబ్‌సైట్లో దరఖాస్తును అందుబాటులోకి తీసుకొచ్చింది.
 202425లో కొత్తగా చేరిన, అప్పటికే విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు దరఖాస్తు చేయాలి.మొదటి దశలో డెమోగ్రాఫిక్ మ్యాచింగ్, రెండోదశలో బయోమెట్రిక్ అథెంటిఫికేషన్ ఉంటుంది. మూడో దశలో దరఖాస్తు పూర్తి చేయాలి. డే స్కాలర్, కాలేజీ అనుబంధ హాస్టళ్ల విద్యార్థులు సైతం ఇదే తరహాలో పూర్తి చేయాలి.
డెమోగ్రాఫిక్ అథెంటిఫికేషన్ కోసం విద్యార్థి ఆధార్‌లోని పేరు, పదో తరగతి ధ్రువీకరణ పత్రంలో పేరు సరిపోలాలి. టెన్త్ క్లాస్ హాల్‌టికెట్ నంబర్, పుట్టిన తేదీ, ఉత్తీర్ణత సాధించిన ఏడాది, రెగ్యులర్/ప్రైవేటు వివరాలు నమోదు చేయాలి.విద్యార్థి పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ కనిపిస్తాయి. స్టూడెంట్ జెండర్, కులం, ఉపకులం, ఆధార్ నంబర్, మొబైల్ నంబరు, చదువుతున్న యూనివర్సిటీ/బోర్డు, కళాశాల పేరు, ఊరు నమోదు చేసి సబ్మిట్ చేయాలి.అనంతరం డెమో ఆథెంటిఫికేషన్ జరుగుతుంది. పదో తరగతి మెమో, ఆధార్‌లోని వివరాలు సమానంగా ఉంటే విజయవంతమైనట్లు ఫోన్‌కు మెసేజ్ వస్తుంది. డెమోగ్రాఫిక్ ధ్రువీకరణ ఫెయిలైతే దాని ప్రకారం ఆధార్‌లో మార్పులు చేసి ధ్రువీకరించుకున్నాక దరఖాస్తు నంబరు వస్తుంది. తర్వాత రెండో దశకు ఆ వివరాలతో మీ సేవ కేంద్రానికి వెళ్లి బయోమెట్రిక్ ఆథెంటిఫికేషన్ ఇవ్వాలి. అప్పుడే రెండోదశ దరఖాస్తు పూర్తవుతుంది.బయోమెట్రిక్ పూర్తయిన తరువాత విద్యార్థి వివరాలు నమోదు చేస్తేనే దరఖాస్తు పూర్తవుతుంది. దీన్ని పరిశీలన కోసం కళాశాలలో ఇవ్వాలని నాగర్ కర్నూల్ జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి పి.వీ శ్రవణ్ కుమార్ శనివారం ఒక ప్రకటన లో తెలిపారు.



# కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ

**వారధి న్యూస్, మహబూబ్‌నగర్:**కేంద్ర మాజీ మంత్రి గడ్డం వెంకటస్వామి జయంతి వేడుకలు శనివారం ఐ.డి.ఒ.సి ప్రాంగణంలో ఘనంగా నిర్వహించాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ఆవరణలో వెంకటస్వామి చిత్ర పటానికి పూల మాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేయడంతో కార్యక్రమం ప్రారంభమైంది.జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకులు వెంకటస్వామి చిత్రానికి నివాళులు అర్పించారు. శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర మంత్రిగా మరియు పార్లమెంటు సభ్యునిగా సుదీర్ఘ కాలం ప్రాతినిధ్యం వహించిన వెంకటస్వామి, దళిత, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం చేసిన కృషి ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఆయన జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని తెలిపారు.



# ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు పెంచాలని

- కలెక్టర్ హనుమంతు ఆదేశం

**వారధి న్యూస్, యాదాద్రి భువనగిరి:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కె. జెండగే వైద్య సిబ్బందిని ఆదేశించారు. శనివారం బీబీనగర్ మండలం కొండమడుగు ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి, అవుట్ పేషంట్ విభాగం, అందిస్తున్న చికిత్సలు, జ్వరాల కేసులపై వివరాలు పరిశీలించారు.ఇంటింటి జ్వర సర్వే అవసరమైతే చేపట్టాలని సూచించిన కలెక్టర్, ఈనెలలో ప్రసవం కానున్న గర్భిణులపై దృష్టి సారించాలని చెప్పారు. సాధారణ ప్రసవాల కోసం క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కలెక్టర్ వెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ శ్రవణ్ కుమార్, ఇతర వైద్య సిబ్బంది ఉన్నారు.

# పరిశ్రమల స్థాపనకు కలెక్టర్ సహకారంఅనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలి

**వారధి న్యూస్, సూర్యాపేట:** జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు అన్ని విధాలా సహకారం అందించనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ లో జరిగిన జిల్లా పరిశ్రమల ఘప్రోత్సాహక కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిశ్రమలకు అనుమతుల కొరకు టిఎస్ ఐపాస్ కమిటీతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.
డిఐపిసి, టిఎస్ ఐపాస్ కమిటీ సభ్యులతో కలెక్టర్ మాట్లాడుతూ, కొత్త పరిశ్రమల స్థాపనకు సంబంధించి దరకాస్తులను పరిశీలించి సింగిల్ విండో ద్వారా అనుమతులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. పియమ్ విశ్వకర్మ కార్యక్రమంలో 18 రకాల స్వయం ఉపాదులపై ఇచ్చిన శిక్షణపై పూర్తి నివేదిక అందించాలని, ldm, dpo మరియు పరిశ్రమల శాఖ అధికారులు పరిశీలించి నివేదిక ఇవ్వాలని చెప్పారు.
పెండింగ్‌లో ఉన్న దరకాస్తులను తక్షణమే మంజూరు చేయాలని, సంబంధిత శాఖలు తమ పరిధిలోని అనుమతులను సకాలంలో జారీ చేయాలని కలెక్టర్ సూచించారు. ఎస్సీ, ఎస్టీ సంబంధిత టీ ప్రైడ్ పథకం కింద 43 యూనిట్లు మంజూరు చేస్తూ కమిటీ తీర్మానం చేసినట్లు ఆయన వెల్లడించారు.ఈ కార్యక్రమంలో ఇండస్ట్రియల్ మేనేజర్ టి సీతారాం, ఎల్డీఎం బాపూజీ, సిపిఓ కిషన్, ఫైర్ ఆఫీసర్ జానయ్య, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఏ ఆదిత్య, సి టి ఓ బి యాదగిరి, డి టి సి పి ఓ వి మాధవి, డిటిడిఓ కే శంకర్, పి వెంకటేశ్వర్లు, ఏడిఈ బి ఉదయ భాస్కర్ తదితర అధికారులు పాల్గొన్నారు





# తెలంగాణలో బిజెపికి ప్రజల ఆదరణ పెరుగుతున్నదని చెప్పిన కొండా విశ్వేశ్వర్ రెడ్డి

**వారధి న్యూస్, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీకి ప్రజల్లో ఆదరణ పెరుగుతున్నదని, ఈ విషయాన్ని చేవెళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వరెడ్డి తెలిపారు. మైలార్ దేవ్ పల్లి డివిజన్ బృందావన్ కాలనీలో రాజేంద్రనగర్ నియోజకవర్గం బిజెపి ఎమ్మెల్యే, కండెస్టెంట్ మైలార్ దేవ్ పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఇంటింటికి వెళ్లి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "డివిజన్లోని ప్రతి బూత్లో 400 మంది చొప్పున డివిజన్ వ్యాప్తంగా 20 వేల సభ్యత్వాన్ని టార్గెట్ చేసుకోవాలని" అభిప్రాయపడ్డారు. ఆయన సూచనలను కొనసాగిస్తూ, "బీజేపీ పార్టీలో చేరడానికి యువత సిద్ధంగా ఉన్నారు" అని చెప్పారు.గత అసెంబ్లీ మరియు పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పార్టీకి మంచి మెజార్టీని అందించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. "ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు చేరవేసి, ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా పని చేయాలి" అని ఆయన చెప్పారు .ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అడికే జనార్ధన్, బూత్ కోఆర్డినేటర్, పార్టీ నాయకులు, మరియు ప్రజలు పాల్గొన్నారు.




# సూర్యాపేట జిల్లాలో ఐజీపీ సత్యనారాయణ సమీక్ష

- అక్రమ రవాణాపై కఠిన చర్యలు, ప్రజల సహకారంపై దృష్టి

**వారధి న్యూస్, సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయంలో మల్టి జోన్2 ఐజీపీ శ్రీ సత్యనారాయణకు జిల్లా ఇంచార్జి ఎస్పీ శరత్ చంద్ర పవార్ మరియు అదనపు ఎస్పీ నాగేశ్వర రావు పుష్పగుచ్చం అందించి గౌరవ వందనం తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఐజీపీ, సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేయడం, రికార్డ్స్ నిర్వహణ, కేసుల దర్యాప్తు మరియు ఫిర్యాదుల పరిశీలనలో సిబ్బందికి సలహాలు ఇచ్చారని చెప్పారు. రాష్ట్ర సరిహద్దుల్లో అక్రమ రవాణాను నిరోధించడానికి చర్యలు తీసుకోవాలని, గంజాయి, ఇసుక అక్రమ రవాణా, పిడిఎస్ బియ్యంతో కూడిన అక్రమ వ్యాపారాలను నియంత్రించాలనే ముఖ్యమైన సూచనలు చేశారు. 22 ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేయడం జరుగుతోందని, ప్రజల సహకారంతో శాంతిభద్రతలు పెరగాలని ఐజీపీ కోరారు.



విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com




## వాసవి మాత ఆలయంలో గౌరి దేవి గా అమ్మవారు



**వారధి న్యూస్, మహబూబ్ నగర్:** మక్తల్ పట్టణంలో వెలిసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో వాసవి మాత లలిత దేవి అలంకరణలో దర్శనం ఇచ్చారు, ఉదయం గణపతి ప్రార్థన సాయంత్రం సామూహిక కుంకుమార్చన, బతుకమ్మను ఆలయంలో మహిళలు, చిన్నారులు,ఆటపాటలతో నృత్యాలు చేశారు, ఆలయ ప్రాంగణంలో మహిళలు వేసిన అమ్మవారి ముగ్గు అందరిని ఆకట్టుకుంది,అనంతరం పల్లకి సేవ, రథోత్సవము, శేష వాహనంపై అమ్మవారు ఊరేగింపు చేశారు, ఉదయం నుండి భక్తులు అమ్మవారిని దర్శించుకుని తమ కోరికలు తీర్చుకుంటున్నారు,కమిటీ సభ్యులు మాట్లాడుతు కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారంగా అమ్మవారు కొలువై ఉన్నారని అన్నారు, మంత్రాలయం వాస్తవ్యులు దసరా నవరాత్రుల విశిష్టత గురించి , అమ్మవారి పారాయణం, పురాణాల గురించి విశ్లేషించారు, పూజ కార్యక్రమం లో చిన్నారులు, మహిళలు, పురుషులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు , అనంతరం వచ్చిన భక్తులకు అల్పాహారం వితరణ చేశారు, ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళా సంఘం, ఆర్యవైశ్య యువజన సంఘం, పట్టణ ప్రజలు, భక్తులు,చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.



## పాలమూరులో ఘనంగా బతుకమ్మ వేడుకలు

- **ఎంపీ అరుణమ్మ పాల్గొనడం విశేషం**

**వారధి న్యూస్, మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని రెడ్డి సేవాసమితి మహిళా విభాగం ఆధ్వర్యంలో దొడ్లోనిపల్లిలో బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించారు. రెడ్డి హాస్టల్ ఆవరణలో గౌరమ్మ పూజలు చేసి, అనంతరం బతుకమ్మ సంబరాల్లో ఎంపీ డీకే అరుణ పాల్గొన్నారు. స్థానిక మహిళలు, యువతులతో కలిసి ఆమె బతుకమ్మ ఆడుతూ ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో ముఖ్య ఆకర్షణగా ఎంపీ అరుణమ్మతో పాటు, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సతీమణి ప్రసన్న పాల్గొన్నారు.



## మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

- **కల్వకుర్తి ముస్లీం జేఏసీ**

**వారధి న్యూస్, మహబూబ్‌నగర్:** మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కల్వకుర్తి ముస్లీం జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఘజియాబాద్ ప్రాంతానికి చెందిన నారింగనాథ్ అనే పూజారి మహమ్మద్ ప్రవక్తపై చేసిన అనుచిత వ్యాఖ్యలతో శనివారం కల్వకుర్తి పట్టణంలో ముస్లీం జేఏసీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. జామా మస్జీద్ నుండి మహబూబ్‌నగర్ చౌరస్తా వరకు ప్లకార్డులు ప్రదర్శిస్తూ సాగిన ఈ నిరసన ర్యాలీ అనంతరం, నారింగనాథ్ పూజారి దిష్టిబొమ్మను దహనం చేసి, అతనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసారు. ముస్లీం జేఏసీ నాయకులు, మతగురువులు, మున్సిపల్ కౌన్సిలర్లు, స్థానిక ముస్లీం యువకులు ఈ నిరసనలో పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ, ఇలాంటి వ్యాఖ్యలు హిందూ, ముస్లీం సోదరుల మధ్య మత విద్వేషాలు ప్రేరేపించే ప్రమాదం ఉందని, నారింగనాథ్ పూజారి ముస్లీం సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## పోగొట్టుకున్న నగదు, ఫోన్ ను బాధితురాలికి అందించిన ట్రాఫిక్ పోలీస్ సీఐ వెంకట్ రాములు

**వారధి న్యూస్, హైదరాబాద్:** సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో పోగొట్టుకున్న నగదు, సెల్ ఫోన్‌ను బాధితురాలికి తిరిగి అందజేసిన గోపాలపురం ట్రాఫిక్ పోలీసులు. ఎల్లమ్మ అనే మహిళ అడ్డగుట్ట నుండి సికింద్రాబాద్ వెళ్తున్న సమయంలో, శనివారం రైల్వే స్టేషన్ వద్ద ఆమె తన సెల్ ఫోన్ మరియు రూ. 3 వేల నగదు ఉన్న పర్సును పోగొట్టుకుంది. విధుల్లో ఉన్న ట్రాఫిక్ హోంగార్డు రోడ్డుపై పడి ఉన్న పర్సును గుర్తించి, గోపాలపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. పర్సులో ఉన్న సెల్ ఫోన్ నంబర్ ఆధారంగా బాధితురాలిని గుర్తించి, సీఐ వెంకట్ రాములు ఆమెకు పర్సుతో పాటు రూ. 3 వేల నగదు మరియు ఫోన్‌ను అప్పగించారు. యధాతథంగా తన పర్సు తిరిగి పొందినందుకు ఎల్లమ్మ




ఆనందం వ్యక్తం చేస్తూ, ట్రాఫిక్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపింది.

## బిజెపి పార్టీ సభ్యత్వం సికింద్రాబాద్ నియోజకవర్గం లో అధికం

- **మేకల సారంగపాణి కంటెస్టెడ్ ఎమ్మెల్యే**

**వారధి న్యూస్, హైదరాబాద్:** సికింద్రాబాద్ నియోజకవర్గం లో భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు జిల్లాలో నంబర్ వన్ స్థానంలో నిలిచిందని సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగా పాణి అని అన్నారు. బిజెపి పార్టీ నాయకులు,కార్యకర్తల అందరి సహకారంతో 60 వేల పైగా సభ్యత్వ నమోదు చేశామని వెల్లడించారు. రాబోయే రోజుల్లో మరింత కృషిచేసి ఈ సభ్యత నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేస్తామని కంటెస్టెడ్ ఎమ్మెల్యే, బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు.

చిలకలగూడ గాంధీ విగ్రహం వద్ద రాష్ట్ర ఓబీసీ నాయకులు ఆకారం రమేష్ ఏర్పాటుచేసిన సభ్యత నమోదు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఓబిసి ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, సంజయ్ గానే తే, జిల్లా ఓబీసీ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బీజేపీ సభ్యత్వం లో చురుకుగా పాల్గొని హైదరాబాద్ జిల్లాలోనే మొదటి స్థానంలో సికింద్రాబాద్ ఉండాలని తెలియజేశారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆశా సాధన కోసం ప్రజలందరినీ బిజెపిలో చేర్పించాలని, రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రము లో అధికారం కైవసం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సభ్యత్వం కన్వీనర్ కనకట్ల హరి, పార్టీ కన్వీనర్ నాగేశ్వర్రెడ్డి, రవి ప్రసాద్ గౌడ్,డివిజన్ అధ్యక్షులు అంబాల రాజేశ్వరరావు, హనుమంతు ముదిరాజ్, ప్రభు గుప్తా, శారద మల్లేష్, అనిత,మద్దర్ల శ్యాంసుందర్,మలికంటి వీరన్న, దేవుడు కుమార్, ఈ ఎల్ ప్రతాప్ కుమార్, అనిల్, అనూష సింహాచలం బాబు, సరోజన, సేతు మహేష్, దత్తు తదితరులు పాల్గొన్నారు.






## పేద ప్రజల అభ్యున్నతికి పాటుపడిన గొప్ప మహానేత గుడిసెల వెంకటస్వామి

- **అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ**

**వారిది న్యూస్, నాగర్ కర్నూల్ బ్యూరో:** నిరంతరం పేద ప్రజల అభ్యున్నతికి పాటుపడిన మహానేత మాజీ మంత్రి గుడిసెల వెంకటస్వామి అని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు శనివారం అచ్చంపేట పట్టణంలోని టీఎన్జీవో భవనంలో డివిజన్ మాల మహానాడు ఆధ్వర్యంలో వెంకటస్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై కాకా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాకా జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలని ఉత్తర్వులు ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పేద ప్రజలు, బడుగు బలహీన వర్గాల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆయన తెలంగాణ తొలి మలి దశ ఉద్యమకారుడిగా,సింగరేణి బాంధవుడిగా, కార్మిక పక్షపాతిగా వెంకటస్వామి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. కాకా ఎంతోమంది బడుగు బలహీన వర్గాల పేద ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేసిన మహానేత అన్నారు. హైదరాబాద్ నగరంలో ఎంతో మంది నిరుపేదలకు కూడు,గూడు ఆధారం లేని పేద ప్రజలందరికీ ఆ రోజుల్లోనే గుడిసెలు వేయించి వారికి నివాసం ఏర్పాటు చేసిన మహానేతన్నారు. ఆయనకు గుడిసెల వెంకటస్వామిగా ఈరోజు వరకు పేద ప్రజలు పిలుచుకుంటారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు బాలస్వామి, కుంద మల్లికార్జున్, ఎనుపోతుల అనిల్, కిన్నెర పాండు, సిద్ధార్థ మహాదేవ్, బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కట్ట గోపాల్ రెడ్డి, గాయకుడు మురళి, అవుట కోటి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.





## గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన వాసవి మాత

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ బ్యూరో:** జిల్లా కేంద్రం లోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న 54వ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శనివారం వాసవి మాత గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. వందలాది మంది భక్తులు నిత్య పూజా కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షులు బిళ్ళ కంటి హరిబాబు ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ నేతృత్వంలో విశేష పూజా కార్యక్రమాలు సామూహిక కుంకుమార్చన డోలోత్సవం నిర్వహించారు. అనంతరం పాలాభిషేకం చేపట్టారు ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ కళ్యాణోత్సవం భక్తులను అలరించింది ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు పట్టణ ఆర్య వైశ్యులు ప్రజలు పాల్గొన్నారు.



## న్యాయశాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ బ్యూరో:** తెలంగాణ న్యాయశాఖ ఉద్యోగుల సంగం ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు.. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి రాజేష్ బాబు, సీనియర్ సివిల్ జడ్జ్ శ్రీమతి జి సబితా మరియు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి మౌనిక పాల్గొన్నారు ఈ కార్యక్రమానికి జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శ్రీదేవి మరియు ఉద్యోగుల సంఘం నాయకులు కేశవరెడ్డి న్యాయవాదుల సంఘం అధ్యక్షులు రాధాకృష్ణ పర్వత రెడ్డి సీనియర్ మరియు జూనియర్ న్యాయవాదులు న్యాయశాఖ ఉద్యోగులందరూ పాల్గొన్నారు ఈ కార్యక్రమం విజయవంతమైనది.



## వృద్ధాశ్రమ నిర్వాహకుడు వెంకటయ్యకు ఘన సన్మానం

**వారధి న్యూస్, మహబూబ్‌నగర్:** కల్వకుర్తి పట్టణంలో ప్రజల భాగస్వామ్య సంస్థ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తున్న వెంకటయ్యను జిల్లా అధికారులు ఘనంగా సత్కరించారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో డబ్ల్యూఓ రాజేశ్వరి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ తారామారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

వృద్ధులకు అందిస్తున్న సేవలకు గాను వెంకటయ్యను సత్కరించి సాలువా మరియు మెమొంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో వయోవృద్ధుల కమిటీ సభ్యులు, అధికారులు మరియు వృద్ధులు పాల్గొన్నారు.



## ప్రపంచ వృద్ధుల దినోత్సవం

**వారిది న్యూస్ నాగర్ కర్నూల్ బ్యూరో:** ప్రపంచ వృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని శనివారం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించడం జరిగింది అని జిల్లా సంక్షేమ శాఖ అధికారిని కే రాజేశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అడిషనల్ కలెక్టర్ సీతారామారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తల్లిదండ్రుల లేదా వయవృద్ధుల మెయింటెనెన్స్ గురించి మరియు మెయింటెనెన్స్ ట్రిబ్యునల్ మరియు ఫస్ట్ లెవెల్ ట్రిబ్యునల్ గురించి తెలియజేస్తూ వయోవృద్ధులకు ఉన్న సమస్యల గురించి నేరుగా జిల్లా కలెక్టర్ కి మరియు ఆర్డిఓ ని కూడా సంప్రదించవచ్చని వారు తెలియజేశారు. ఈ సమాజంలో మారుతున్న కాలానుకునే మానవులు అనేక విధాలుగా తయారవుతున్నారు. మనల్ని కని పెంచిన తల్లిదండ్రులను మర్చిపోయి ఏదో వివిధ బిజీ లైఫ్ ద్వారా ఎక్కడికో వెళ్లి తల్లిదండ్రుల కూడా పట్టించుకోని స్థితిలో ఉన్నారు కాబట్టి తల్లిదండ్రుల చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పైన ప్రతి ఒక్క కుటుంబ సభ్యుల పైన ఉంది ఎప్పుడైతే మన తల్లిదండ్రుల మన మంచిగా చూసుకుంటే అదేవిధంగా మనల్ని కూడా మన పిల్లలు అలాగే చూసుకుంటారని అన్నారు. వయోవృద్ధులకు ఉన్న వివిధ చట్టాల గురించి వివరంగా వివరించారు. వయో వృద్ధుల గురించి ఎన్నో ముఖ్యమైన విషయాలను క్షుణ్ణంగా అందరికీ తెలియజేయాలన్నారు వివిధ శాఖల అధికారులు హెల్త్ డిపార్ట్మెంట్ డాక్టర్ రవికుమార్ మరియు వయోవృద్ధుల యూనియన్ అధ్యక్షులు శ్రీనివాసులు, డాక్టర్ రవి శంకర్ గవర్నమెంట్ హాస్పిటల్, కృష్ణమోహన్ కొల్లాపూర్, మేరీ థామస్ బిజినపల్లి, వెంకటయ్య కల్వకుర్తి, శ్రీనివాసులు హెచ్ఎం, శ్రీధర్ రిటైర్డ్ హెచ్ఎం, సంధ్యారాణి అచ్చంపేట వృద్ధాశ్రమ నిర్వాహకురాలు, అలాగే ఐదు ప్రాజెక్టుల సిడిపివోలు, పోషణ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ వి జ్ఞానం, సఖి కోఆర్డినేటర్ సునీత మరియు వయోవృద్ధులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయంతో విజయవంతం చేశారు.

## కోస్గి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ముద్ది భీములు నియామకం

**వారధి న్యూస్, మహబూబ్‌నగర్:** కోస్గి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ముద్ది భీములు నియమితులయ్యారు. మద్దూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సేవలందించిన భీములు, తన సమర్థతతో పార్టీకి విశేష సేవలందించారు. కాంగ్రెస్ అధిష్టానం, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి తిరుపతి రెడ్డి, భీములును ఈ కీలక పదవికి ఎంపిక చేయడంతో ఆయన పట్ల కృతజ్ఞతలు తెలిపారు. పార్టీకి కష్టకాలంలో అండగా నిలిచిన భీములు, సామాన్య కార్యకర్తగా ఉండి పార్టీలో స్థానం సంపాదించడం పట్ల మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.



విశ్వ వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com




## ఆదర్శ పాఠశాలలో సమస్యల పరిష్కారానికై ఎంఎల్ఎ కు వినతి పత్రాన్ని అందజేసిన పాఠశాల సిబ్బంది

**వారధి న్యూస్, పెబ్బేరు:** పెబ్బేరు ఆదర్శ పాఠశాలలో ఏళ్ళ తరబడి అపరిష్కృతంగా నెలకొని వున్న సమస్యల పరిష్కారం కోసం శనివారం వనపర్తి శాసనసభ్యుడు తూడి మేఘారెడ్డి కి పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బంది వినతి పత్రాన్ని అందజేసారు. జాతీయ రహదారి వేసినప్పుడు మట్టిని త్రవ్వి వాడుకోవడం వల్ల ఆదర్శ పాఠశాల క్రీడా మైదాన ప్రాంతం గుంతలుగా మారిందనీ.వర్షాకాలంలో కురిసిన వర్షపు నీరు పాఠశాల ప్రాంగణంలో నిలిచి చిన్న చెరువుగా మారుతుందని పల్లపు ప్రదేశం కాబట్టి ఆ నీరు అక్కడే నిలిచిపోతుంది. నెలల తరబడి నీరు నిల్వ వుండడం వల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు పాఠశాల కు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. నీరునిల్వ వుండడం వల్ల మైదాన పరిసర ప్రాంతాలు బురదమయంగా మారి విద్యార్థులు ఆడుకోవడానికి ఇబ్బంది పడుతున్నారనీ.అదే విధంగా ఆదర్శ పాఠశాలకు ఆనుకొని జాతీయ రహదారి వుంది.పాఠశాలకు ఎదురుగా యు టర్న్ లేకపోవడం వల్ల విద్యార్థులు జాతీయ రహదారికి వ్యతిరేఖ మార్గంలో పయనిస్తూ పాఠశాలకు వెళ్తున్నారు.ఆ సందర్భంలో విద్యార్థులు ,తల్లిదండ్రులు,అధ్యాపకులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారనీ సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రధానాచార్యులు తూర్పింటి నరేశ్ కుమార్ ,అధ్యాపకులు గంగాధర్, బుచ్చయ్య, ఫకీరయ్య. నాగరాజులు పాల్గొన్నారు



## అనారోగ్యం తో మున్సిపల్ కార్మికుడు మృతి

**వారధి న్యూస్, పెబ్బేరు:** పెబ్బేరు మున్సిపాలిటీ లో కార్మికుగాపని చేస్తున్న శంకర్ గత కొంత కాలంగా అనారోగ్య రీత్యా బాధపడుతూ శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్ పర్సన్ కరుణ శ్రీ, వైస్ చైర్మన్ కర్రే స్వామి, కమిషనర్ ఆదిశేషు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి, మండల కాంగ్రెస్, టిఆర్ఎస్ పార్టీ నాయకులు, మున్సిపల్ సిబ్బంది భౌతిక కాయానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రభుత్వపరంగా వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

## జిల్లా వ్యాప్తంగా నెల రోజులపాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు

- జిల్లా ఎస్పీ రావుల గిరిధర్



**వారధి న్యూస్, వనపర్తి టౌన్:** శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా నెల రోజుల పాటు (అక్టోబర్ 1వ తేది నుండి 31 వరకు) 30, 30(ఎ) పోలీసు యాక్ట్1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేనిది వనపర్తి జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, శాంతి భద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రజా ధనానికి నష్టం కల్గించే, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదన్నారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఇట్టి విషయంలో పోలీసు వారికి సహకరించవలసిందిగా సూచించారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు



**వారధి న్యూస్, వనపర్తి టౌన్:**వనపర్తి జిల్లా చిట్యాల గ్రామంలో ఈరోజు అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమంలో స్వాములు, మహిళలు, యువకులు పాల్గొన్నారు. కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి విజయవంతం చేశారు.



## గద్దర్ భారీ విగ్రహం ఆవిష్కరణ

**వారధి న్యూస్,నాగర్ కర్నూలు బ్యూరో:** నాగర్ కర్నూలు జిల్లాలోని అమ్రాబాద్న ల్లమల ప్రాంతంలోని శ్రీశైలం హైదరాబాద్ ప్రధాన రహదారి మన్ననూరు అంబేద్కర్ చౌరస్తాలో గద్దర్ భారీ విగ్రహాన్ని శనివారం సాయంత్రం ఆవిష్కరించారు. గద్దర్ గళ్ళం వ్యవస్థాపకులు కొల్లూరి సత్యన్న ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విగ్రహాన్ని ప్రొఫెసర్ కంచ ఐలయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు. ముఖ్య అతిథులుగా అచ్చంపేట శాసనసభ్యులు చిక్కుడు వంశీకృష్ణ అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకులు విమలక్క, గద్దర్ కూతురు వెన్నెల, పసునూరి రవీందర్, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, ప్రముఖ గాయకుడు ఏపూరి సోమన్న ,గోపాల్ ,మురళి, ప్రధాన భక్త సుదర్శన్, స్థానిక ప్రజాప్రతినిధులు నాయకులు పెద్ద ఎత్తున గద్దర్ అభిమానులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలి

- అధికారులు ప్రభుత్వ వారదులుగా పని చేయాలి
- రాయితీ గ్యాస్ సిలిండర్ల వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించాలి
- వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డి



**వారధి న్యూస్, వనపర్తి టౌన్:** ప్రభుత్వ అధికారులు ప్రభుత్వానికి, ప్రజలకు వారదులుగా పనిచేయాలని ప్రభుత్వ పథకాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని వనపర్తి ఎమ్మెల్యే మెగా రెడ్డి పేర్కొన్నారు.శనివారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో, ఎంపీఓ లతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు.ప్రత్యేకంగా రాయితీ గ్యాస్ సిలిండర్లా వినియోగంపై ప్రజల్లో అవగాహన కల్పించి ప్రతి ఒక్కరికి రాయితీ అందేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. గృహజ్యోతి పథకం కింద చేపట్టిన జీరో కరెంట్ బిల్లు ను సైతం ప్రతి ఒక్క వినియోగదారునికి ఉపయోగపడేలా మండల స్థాయిలోని ఎంపీడీవో లు అందరూ కూడా లబ్ధిదారులకు రాయితీ అందేలా చూడాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు.పంచాయతీరాజ్, జిల్లా పరిషత్ ల ఆధ్వర్యంలో చేపట్టిన పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేసి చర్యలు తీసుకోవాలని ఈఈ మల్లయ్య, డిఈ బండారి శ్రీనివాస్ లను ఆదేశించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలు అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు ,ఎంపీలు,పంచాయతీరాజ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లకు కలెక్టర్ ఆదేశాలు

**వారధి న్యూస్, మహబూబ్‌నగర్:** శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల అక్టోబర్ 31 నుంచి నవంబర్ 18 వరకు జరగనున్న నేపథ్యంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని అవసరమైన ఏర్పాట్లు చేయాలని మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. జిల్లా చిన్న చింతకుంట మండలంలోని అమ్మాపూర్ సమీపంలో వెలసిన శ్రీ కురుమూర్తి స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల నిర్వహణపై శనివారం కోఆర్డినేషన్ కమిటీ సమావేశం జరిగింది. దేవరకద్ర నియోజకవర్గ శాసన సభ్యులు జి. మధుసూదన్ రెడ్డి, ఇతర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.బ్రహ్మోత్సవాల్లో నవంబర్ 2న స్వామివారి కల్యాణోత్సవం, నవంబర్ 6న స్వర్ణాభరణాలతో అలంకారోత్సవం, నవంబర్ 8న ఉద్దాల ఉత్సవం వంటి ప్రధాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.భక్తులకు తాగునీరు, పారిశుధ్యం, రవాణా, టాయిలెట్, బందోబస్తు, వైద్యసేవలు వంటి అన్ని వసతులు అందించేందుకు సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రహదారి మరమ్మతులు, బారికేడింగ్, కంట్రోల్ రూమ్ ఏర్పాటు, అలాగే 24 గంటల విద్యుత్ సరఫరా కల్పించడం వంటి ఏర్పాట్లను సమర్థంగా అమలు చేయాలని సూచించారు. దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి, కురుమూర్తి బ్రహ్మోత్సవాలకు అధిక సంఖ్యలో భక్తులు వస్తారని, అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుని జాతరను విజయవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, అదనపు ఎస్పీ రాములు, ఇతర ఉన్నత అధికారులు, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీనివాస్ రాజు, కురుమూర్తి స్వామి దేవాలయం చైర్మన్ గోవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.



## ఘనంగా వెంకటస్వామికాక జయంతి వేడుకలు

**వారధి న్యూస్, హైదరాబాద్ హైదరాబాద్:** గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ శ్రీమతి మోతె శ్రీలత శోభన్ రెడ్డి తార్నాక లోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో జి. వెంకటస్వామి (కాకా) 95వ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ గారు మాట్లాడుతూ వెంకటస్వామి సేవలను గుర్తుచేసుకున్నారు. శ్రీ జి. వెంకటస్వామి తన రాజకీయ జీవితంలో రాష్ట్రాభివృద్ధికి చేసిన అనేక సేవలు, కార్మికుల హక్కుల కోసం చేసిన పోరాటాలు అందరికీ ఆదర్శంగా నిలుస్తాయని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పవన్ కళ్యాణ్, ప్రైవేట్ ఉద్యోగాల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంధం రాములు, విజయకుమార్, సుధాకర్, రాము, కిరణ్, భాస్కర్ నాయకులు పాల్గొన్నారు.




## అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ బ్యూరో:**నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో గల శ్రీ చక్ర సహిత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మూడవరోజు శనివారం అమ్మవారు అన్నపూర్ణ దేవి అలంకరణ అమ్మవారుగ దర్శనమిచ్చారు. దేవాలయంలో అమ్మవారికి కుంకుమార్చన అనంతరం హోమం నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా రెండవ రోజు నరసింహ స్వామి కళ్యాణం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ శర్మ ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొరివి చంద్రశేఖర్ దంపతులు. పాపిశెట్టి బాలరాజు దంపతులు. కామిశెట్టిశ్రీనివాసులు దంపతులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. దసరా నవరాత్రుల ఉత్సవంలో భాగంగా శ్రీ చక్ర సహిత శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం నందు పూజా కార్యక్రమాలలో భక్తుల అధిక సంఖ్యలో పాల్గొని బట్టి శ్రద్ధలతో తిలకిస్తున్నారు.



## అన్యక్రాంతం అవుతున్న దేవాలయాల భూములు

- దేవాలయ భూములకు రక్షణేది?
- ఇనాం భూములపై నకిలీ వారసులు.
- పెళ్లే కాలేదు వారసులేలా వస్తారు?
- కబంధ హస్తాల్లో పిఠాధిపతుల భూములు.
- సుమారు 44ఎకరాల భూములు గద్దల పాలు.
- శివుని ఇనాం భూములను ఆక్రమించుకున్న నఖీలు వారసులు.



విషయము : శివుని గుడి మరియు నిర్మామిడి మఠమునకు సంబంధించిన సర్వే నెంబర్లు 777, 781,783,784 మరియు ఇతర భూములు సుమారు నలభై ఎకరములు (భూమి) అన్యాక్రాంతము జరుగుట గురించి కేశంపేట గ్రామము మరియు మండలము, జిల్లా రంగారెడ్డి అన్యాక్రాంతము తగు చర్య గురించి.

1. మేము కేశంపేట గ్రామ ప్రజలము చేయు విజ్ఞాపన ఏమనగా కేశంపేట గ్రామములో ఒక శివాలయము మరియు మఠం (నిర్మామిడి మఠం) గ్రామ సమీపములో పురాతనము నుండి ఉన్నది. ఇట్టి శివాలయము మరియు మఠం నిర్మాణమునకు సంస్థాన్ వనపర్తి రాజా గారు కొన్ని భూములు సుమారు నలభై ఎకరములు సర్వే నెం.777,781, 783,784 మరియు ఇతర భూములు శౌరి (మాఫీ ఇనాం) గా ఇచ్చి యుండిరి. ఇట్టి భూములు మఠం మరియు శివాలయము నిర్మాణమునకు ఇచ్చి యున్నవే కాని వ్యక్తులకు ఇచ్చినవి కావు అని గ్రామ రికార్డులు ద్వారా తెలియవచ్చును.

2. మఠానికి, మఠంకరి బసవయ్య తండ్రి వీరుపాక్షయ్య మరియు మల్లయ్య గారులు మఠాధి పతులుగా యున్నారు. వీరి ఉభయులు కూడా సన్యాసులు వీరికి సంతానం మరియు వారసులు లేరు.

3. మఠానికి సంబంధించిన భూములు, పూర్వమే కొన్ని అన్యాక్రాంతమైనవి. ముఖ్యంగా (5 ఎకరాలు గంప కృష్ణయ్యకు) (6 ఎకరాలు బండ అంజయ్యకు) (3 ఎకరాలు కరెంటు సబ్‌స్టేషన్) నిర్మాణమునకు , 14 ఎకరాలు మరియు ప్రస్తుతము ఇట్టి భూములు ప్లాట్లుగా చేసి విక్రయించబడుచున్నవి.

**వారధి న్యూస్, షాద్ నగర్:** మండలంలో వందల ఎకరాల దేవాలయ భూములున్నాయి.కానీ వీటిని రక్షించడంలో సంబంధిత అధికారులకు తెలుసో లేదో కానీ కొంతమంది నాయకులకు తెలుసని బాహటంగానే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.ఇప్పటికైనా దేవాదాయ శాఖాధికారులు మేల్కొని భూములను రక్షించాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి.

**భూములకు రక్షణ లేకపోవడంతో కబ్జా చేస్తారా?**

కేశంపేట మండలంలో దేవాలయాల భూములే కాదు...అనేక ఆలయాలకు ఉన్న విలువైన భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని వాదనలు వినిపిస్తున్నాయి..పట్టా భూముల పక్కనే ఈ భూములు ఉండడం,దేవాలయాల భూములకు రక్షణ లేకపోవడంతో కబ్జాకు గురవుతున్నాయి.విలువైన ఈ భూములకు రక్షణ కల్పించవలసిన పాలక మండళ్లు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.దేవుడి భూములకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత అటు అధికారులకే కాకుండా ,పాలకులది కూడా ఉందని సామాన్య ప్రజలు,బాధితులు చెబుతున్నారు.కొంతమంది పాలకుల వల్లనే ఈ భూములను అన్యాక్రాంతానికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు లేకపోలేదు.

**వివరాల్లోకి వెళితే...**

రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం కేంద్రంలో శివాలయం నిర్మాణదాత,వనపర్తిసంస్థానం రాజుకు చెందిన సర్వే నెంబర్.. 777,781,783,784 మరియు కొన్ని (మాఫీ ఇనాం) భూములుగా ఇచ్చారని,అట్టి భూములను కేవలం మఠం మరియు శివాలయానికి కానీ వ్యక్తులకు ఇవ్వలేదని గ్రామ రెవిన్యూ రికార్డులో నమోదు చేశారని తెలుస్తుంది.కానీ ఈ భూములపై కొన్ని గద్దల కన్ను పడిందో ఏమో గాని వారి వారసులం అంటూ చెప్పుకొని,ఆక్రమించుకొని,యదేచ్చగా పంటలేసుకొని దొరల బ్రతుకుతున్నారు..శివాలయానికి ఉన్న 44ఎకరాల భూములను వారసులమని చెప్పుకుంటున్న మఠం చంద్రశేఖర్, మఠం సిద్దేశ్వర్, బసవేశ్వర్, కోటేశ్వర్,మహేశ్వర్ ల పేరిట స్వాధీనం చేసుకున్నారు.మఠానికి సంబంధించిన భూములు,పూర్వమే అన్యక్రాంతమైనవి. ముఖ్యంగా గంప కృష్ణయ్యకు(5ఎకరాలు),బండ అంజయ్యకు (6ఎకరాలు),విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణమునకు(3ఎకరాలు)అలాగే 14 ఎకరాల భూములను ప్లాట్లుగా చేసుకొని విక్రయిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**సంతానం లేదు..కానీ వారసులంటూన్నారంటా?**

మఠానికి సంబంధించిన బసవయ్య తండ్రి విరుపాక్షయ్య మరియు మల్లయ్య లు మఠాధిపతులుగా ఉన్నారు,వీరు ఇరువురు సన్యాసులు అంటే వీరికి సంతానం లేదు మరియు వారసులు లేరు.కరి బసవయ్య మరణానంతరం కొన్ని సంవత్సరంలో పెద్ద గంగాధరయ్య తండ్రి సిద్దయ్య మరియు చిన్న గంగాధరయ్య తండ్రి బుచ్చప్ప పీఠాధిపతులుగా ఉన్నారు. వీళ్లు వివాహం చేసుకొని వెళ్లిపోవడం జరిగింది.ప్రస్తుతం వీరికి కుమారులు మాత్రమే మాఠాధిపతులుగా చెప్పుకుంటూ ఆస్తులను హారతి కర్పూరంలా హారించి వేస్తున్నారు.మఠం భూములు చిన్న గంగాధరయ్య మరియు పెద్ద గంగాధరయ్య లు చట్టవిరుద్ధంగా వ్యవహరించి,సగం సగం చేసుకున్నట్లు తెలుస్తుంది.అంతేకాకుండా భూములను వారి పేరిట పట్టగా మార్చుకున్నారని తెలుస్తుంది. కొంతమంది దేవాదాయ శాఖ అధికారులు అమ్యాన్యాలకు తలొగ్గి ఎన్ఓసీలు సైతం జారీ చేస్తున్నారని ప్రచారం సాగుతుంది.దీంతో రెవెన్యూ అధికారులు ఎన్ఓసీల ఆధారంగానే క్రమబద్ధీకరిస్తున్నట్టు తెలుస్తుంది...

**ఆక్రమించుకున్న వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి.**

ఇదిలా ఉంటే మండల కేంద్రంలో ఉన్న శివాలయము మరియు నిర్మామిడి భూములు అన్నిక్రాంతం కాకుండా,,దేవాలయానికి ఇచ్చిన భూములను తిరిగి ఇవ్వాలని,ప్రభుత్వం కల్పించుకుని భూములు ఇవ్వాలని,దేవుడికి న్యాయం జరిగే వరకు పోరాడతామని హిందూ,సామాజిక,ధార్మిక సంఘాలు, మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంలో న్యాయం జరగకపోతే, మానవ హక్కుల సంఘానికి వెళ్తామని హిందూ ధార్మిక సంఘాలు మండల కేంద్ర ప్రజలు హెచ్చరిస్తున్నారు...




## తెలుగుదేశం అభివృద్ధే లక్ష్యంగా పనిచేసిన వ్యక్తి కర్నాటి రామలింగం

- మాజీ జెడ్ పి టి సి కర్నాటి రామలింగం మృతి, పార్టీకి తీరని లోటు

**వారధి న్యూస్, నాంపల్లి** నాంపల్లి మండల మాజీ జెడ్ పి టి సి, మాజీ మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ కర్నాటి రామలింగం ఇటీవల మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న తెలుగుదేశం పార్టీ మునుగోడు నియోజకవర్గ ఇన్చార్జి లక్ష్మయ్య, మాజీ జెడ్ పి టి సి రామలింగం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి మనోధైర్యం కల్పించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో లక్ష్మయ్య మాట్లాడుతూ, "రామలింగం లేకపోవడం పార్టీకి తీరని లోటు" అని పేర్కొన్నారు. ప్రజల్లో మమేకమై, పార్టీ అభివృద్ధే లక్ష్యంగా, గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించడానికి ఆయన చేసిన కృషి అమూల్యమైనది అని అన్నారు. రానున్న రోజుల్లో తెలుగుదేశం పార్టీ స్థానిక ఎన్నికల్లో పోటీ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ భువనగిరి పార్లమెంట్ కార్యదర్శి షరీఫ్, మండల అధ్యక్షులు మొగుదాల పార్వతమ్మ, మండల కార్యదర్శులు పుప్పాల యాదగిరి, మంగి మహేష్, ఎరుగండ్లపల్లి మాజీ సర్పంచ్ సుగుణమ్మ, పాశం రఘుపతి, యాట వెంకటేష్, గోవిందా చారి, చిలు వేరు రాజు తదితరులు పాల్గొన్నారు.

# హీరోయిన్ తాప్సీ ఆ హీరోల గురించి ఏమన్నారో తెలుసా?

తెలుగు సినీ పరిశ్రమకు నార్త్ నుండి వచ్చిన కథానాయికల్లో తాప్సీ ఒకరు. ఝుమ్మందినాథంతో తెలుగు సినిమాల్లో ఎంట్రీ ఇచ్చిన ఈ అందాలభామ తొలిచిత్రంతోనే కుర్రకారును అలరించింది. ఆ తరువాత అనతికాలంలోనే టాలీవుడ్‌లో బిజీ హీరోయిన్‌గా మారింది. అయితే ప్రస్తుతం తెలుగు సినిమాలను తగ్గించిన తాప్సీ ఇప్పుడు బాలీవుడ్‌లో బిజీ కథానాయికగా గా మారింది. అయితే తెలుగులో సినిమాలు తగ్గించిన ఈమె ఒకప్పుడు తెలుగులో క్రేజీ హీరోలందరితోనూ జతకట్టింది.ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ ప్రభాస్‌తో మిస్టర్ పర్‌ఫెక్ట్ చిత్రంలో నటించాను. ఆయన అందగాడు. నా ఎత్తుకు నేను ఆయనకు జోడిగా బాగా సరిపోయాను అని అందరూ అన్నారు. ప్రభాస్ చాలా జోవియల్‌గా వుండేవాడు. కలివిడి తత్వం ఎక్కువ. అయితే నేను మొదట్లో మిస్టర్ పర్‌ఫెక్ట్ చిత్రంలో నటించడానికి సంకోంచించాను. ఎందుకంటే ఆ తరువాత అన్ని రెండో హీరోయిన్ పాత్రలే వస్తాయని అనుకున్నాను. కానీ కథ నచ్చి ఆ సినిమాలో నటించాను. ఆ సినిమా సాధించిన విజయంతో నాకు మంచి పేరు వచ్చింది' అని తెలిపారు. రవితేజ గురించి ఆమె మాట్లాడుతూ రవితేజ అంటే అసలు సిసలు ఎనర్జీ ఎలా వుంటుందో చూడొచ్చు. ఆయనతో షూటింగ్ అంటే మనకు కూడా హుషారు వస్తుంది. అందుకే మాస్ ప్రేక్షకులను రవితేజని బాగా ఇష్టపడతారు. నేను రవితేజతో కలిసి వీర చిత్రంలో నటించాను. ఆ సినిమా సెట్‌లో మార్నింగ్ నుంచి ఈవెనింగ్ వరకు అదే హుషారు. ఆయన్ని చూస్తుంటే మనకు ఎనర్జీ వచ్చిన ఫీలింగ్ కలుగుతుంది' అంటూ చెప్పుకొచ్చారు తాప్సీ. ప్రస్తుతం పలు బాలీవుడ్ ప్రాజెక్టులతో బిజీగా వున్న తాప్సీ పన్ను త్వరలోనే తెలుగులో రూపొందనున్న ఆనందో బ్రహ్మ సీక్వెల్‌తో పాటు మరో క్రేజీ హీరో చిత్రంలో నటించడానికి అంగీకరించినట్లుగా తెలిసింది.





# మాచో స్టార్ గోపీచంద్ 'విశ్వం' హిలేరియస్ ఎంటర్ టైనర్

## దర్శకుడు శ్రీను వైట్ల



మాచో స్టార్ గోపీచంద్, దర్శకుడు శ్రీను వైట్ల ఫస్ట్ కొలాబరేషన్ లో వస్తున్న మోస్ట్ యాంటిసిపేటెడ్ మూవీ 'విశ్వం'. రీసెంట్ గా రిలీజైన టీజర్ ట్రెమండస్ రెస్పాన్స్ తో సినిమాపై అంచనాలు మరింతగా పెంచింది. ఈ హై బడ్జెట్ ఎంటర్‌టైనర్‌ను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, వేణు దోనేపూడి చిత్రాలయం స్టూడియోస్‌పై టిజి విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. దోనేపూడి చక్రపాణి ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. గోపీచంద్, కావ్యథాపర్ పై విడుదలైన రొమాంటిక్ సాంగ్ కు మంచి స్పందన వచ్చింది. దసరా కానుకగా విశ్వం సినిమా అక్టోబర్ 11న గ్రాండ్ గా విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు శ్రీనువైట్ల మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఆ విశేషాలు.

**గోపీచంద్ తో విశ్వం ఎలా మొదలైంది?**

గోపీచంద్, నేను ఎప్పటినుంచో సినిమా చేయాలనుకున్నాం. అందుకే ఆయన్ను దృష్టిలో పెట్టుకుని కథ రెడీ చేసి వినిపించాను. తను సాటిస్ ఫై అయి షూట్ కు వెళదాం అన్నారు. నా శైలిలోకి రావాలంటే 8నెలలు పడుతుందని టైం తీసుకున్నా. అంతా బాగా వచ్చాక అభిరుచిగల నిర్మాత దోనేపూడి చక్రపాణి తోపాటు విశ్వప్రసాద్ గారు జాయిన్ అయ్యాక సినిమాకు మరింత బలం చేకూరింది. అందుకే యాక్షన్ హిలేరియస్ ఎంటర్ టైన్ మెంట్, ఎమోషన్స్ చేయాలని డెప్త్ లోకి వెళ్ళి ఈ సినిమా చేశాను.

**గోపీచంద్ యాక్షన్ మార్క్ వుంటుందా, మీ తరహా ఎంటర్ టైన్ వుంటుందా?**

యాక్షన్ తోపాటు హిలేరియస్ ఎంటర్ టైన్ మెంట్ మూవీగా వుంటుంది.

**పాప చుట్టూ కథ తిరుగుతుందా?**

ఇందులో పాప పాత్ర కీలకంగా వుంటుంది.

**చిత్రీకరణ పరంగా మీరు పేస్ చేసిన ఛాలెంజెస్ ఏమైనా వున్నాయా ?**

విశ్వం చిత్రమే చాలా పెద్ద స్పాన్ వున్న కథ. అందుకే మార్కెట్ పరంగా ఛాలెంజ్ గా తీసుకుని దానికి అనుగుణంగా డిజైన్ చేశాను. అందుకు నిర్మాతల సపోర్ట్ బాగుంది. నేను విశ్వంను ఎలా ఊహించుకున్నానో అలా తీయగలిగాను.

**విశ్వం టైటిల్ గురించి చెప్పండి?**

ఏదో టైటిల్ పెట్టాలని కాకుండా కథ ప్రకారమే పెట్టాం. విశ్వంలో చాలా సీక్రెట్స్ వుంటాయి. అలాగే ఈ విశ్వంలో కూడా చాలా విషయాలుంటాయి.

**కోవిడ్ తర్వాత దర్శకులు ఆడియన్స్ టేస్ట్ రీత్యా చాలా మార్చుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. మీరెలా అప్ డేట్ అయ్యారు?**

గ్యాప్ వచ్చినా నేను ఎక్కడున్నా సినిమాలు చూస్తూ వస్తున్న మార్పులు గమనిస్తూనే వుంటాను. వీటితో పాటు నా శైలిలో ఎంటర్ టైన్ మెంట్ ఎలా చెప్పాలో ఎక్కువ స్ట్రగుల్ అయ్యాను. ప్రోపర్ గా సెట్ అయిందని హీరో, నిర్మాత ఫీలయ్యారు. అదే ప్రేక్షకుడు ఫీల్ అవుతాడు.

**గ్యాప్ తీసుకోవడం సెట్ చేసుకోడానికి కారణమా?**

నేను గేప్ తీసుకున్నా నా శైలి గురించి సోషల్ మీడియాలో చర్చ జరుగుతూనే వుంది. ఏదో చోట నా కంటెంట్ వస్తూనే వుంది. థీమ్ లు రీపీట్ అవుతున్నాయని అంటున్నారు. దాన్ని క్రాక్ చేయాలంటే టైం పడుతుంది. ఫ్రెష్ థీమ్ తో రావాలని కొంత టైం తీసుకున్నా.

**విశ్వంలో మెయిన్ థీమ్ ఏమిటి? ప్రేక్ష కులు సహజత్వాన్ని కోరుకుంటున్నారు గదా?**

పదేళ్ళ నాడు హీరో తెలివితేటలతో ఏదైనా సాధించగలగడం అనే కథలు వచ్చాయి. ఈ సినిమా అలా వుండదు. బర్నింగ్ ఇష్యూ తీసుకుని దాన్ని ఎంటర్ టైన్ మెంట్ లో ఎలా చెప్పొచ్చో చేశాను. మేకింగ్ వైజ్ గా వినూత్నంగా వుంటుంది. నాకూ, గోపీకు చాలా ఫ్రెష్ సినిమా అవుతుంది.

**గోపీచంద్ పాత్ర ఎలావుంటుంది?**

గోపీ పాత్రలో చాలా షేడ్స్ వుంటాయి. సినిమా చూస్తే మీకే తెలుస్తుంది. గ్లింప్స్ లో అటెన్షన్ కోసం అలా చూపించాం.

**యాక్షన్ సీన్స్ ఎక్కడెక్కడ తీశారు?**

రోమ్, మనాలి, గోవాలో చేశాం. రెగ్యులర్ ఫైట్స్ కాదు. సహజంగా వుంటాయి. ప్రతి యాక్షన్ హీరోయిజంలా వుంటుంది. కథ ప్రకారమే ఫైట్స్ వుంటాయి. ఎక్కడా అతికిచ్చినట్లు వుండదు.

**వెంకీ సినిమాలోని ట్రైన్ ఎపిసోడ్ లా విశ్వంలో వున్నట్లుంది?**

నేను ఇందులోనూ ట్రైన్ ఎపిసోడ్ కథకు అవసరం అని పెట్టాను. ముందు ఇలా అనుకున్నప్పుడు వెంకీతో కంపేర్ చేస్తారనిపించింది. కానీ దానికి దీనికి చాలా తేడా వుంటుంది. విశ్వంలో హిలేరియస్ గా వుంటుంది. ట్రైన్ లో అండర్ కరెంట్ డేంజర్ కూడా వుంది. 30 నిముషాల పాటు వెన్నెల కిశోర్, గణేష్, నరేష్, కవిత, చమక్ చంద్ర, షకలక శంకర్ వీరందరితో ట్రైన్ జర్నీ చాలా బాగుంటుంది.

# దిల్ రాజు లాంచ్ చేసిన త్రికాల టైటిల్ పోస్టర్



శ్రద్ధాదాస్ , అజయ్, మాస్టర్ మహేంద్రన్ ప్రధాన పాత్రధారులుగా రిత్విక్ సిద్ధార్థ్ సమర్పణలో మినర్వా పిక్చర్స్ బ్యానర్‌పై రూపొందుతోన్న భారీ చిత్రం 'త్రికాల'. 'స్క్రిప్ట్ ఆఫ్ గాడ్' ట్యాగ్ లైన్. మణి తెల్లగూటి దర్శకత్వంలో రాధికా శ్రీనివాస్ నిర్మాత గా, శ్రీసాయి దీప్ చాట్ల, వెంకట్ రమేష్ దాడి, ఓంకార్ పవన్ లు సహా నిర్మాతలుగా ఈ చిత్రాన్ని నిర్మించారు. చిత్రీకరణను పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంటోంది. విజువల్ గ్రాఫిక్స్‌కు ఎంతో ప్రాధాన్యమున్న ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. భారీ బడ్జెట్‌తో ఫాంటసీ, హారర్ జోనర్ మూవీగా కుమారి ఖండం నేపథ్యాన్ని ఆధారంగా చేసుకుని, నేటి కాలానికి తగ్గట్టుగా మార్పులు చేర్పులు చేసి సినిమాను తెరకెక్కించారు. కుమారి ఖండాన్ని పరిచయం చేస్తూనే మూల కథకు పురాణ నేపథ్యంతో పాటు నూతన హంగులను అద్దుతూ టీమ్ సినిమాను ఆవిష్కరించింది. దేవి చిత్రంలో బాల నటుడిగా మెప్పించిన మాస్టర్ మహేంద్రన్ ఈ చిత్రంతో ప్రధాన పాత్ర దారుడుగా మీ ముందుకు వస్తున్నారు. సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందించేలా ఈ సినిమాను దర్శకుడు మణి తెల్లగూటి అండ్ టీమ్ రూపొందిస్తున్నారు. త్వరలోనే మరికొన్ని విశేషాలను తెలియజేస్తామని చిత్ర యూనిట్ తెలియజేసింది.